


PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 5 సంచిక: 360, పేజీలు - 08

శనివారం, జూన్ 20, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD




# మూసీ రివర్ ఫ్రంట్‌కు గ్రీన్ సిగ్నల్

## బాపు ఘాట్ వద్ద 83 ఎకరాల రక్షణ భూముల బదిలీ!



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్ నగర ముఖచిత్రాన్ని మార్చే ప్రతిష్టాత్మక మూసి నది పునరుజ్జీవన ప్రాజెక్టు లో ఒక కీలకమైన ముందడుగు పడింది. బాపు ఘాట్ వద్ద అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించతలపెట్టిన గాంధీ సరోవర్ ప్రాజెక్టు కు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ ప్రాజెక్టును వేగవంతం చేసేందుకు వీలుగా రక్షణ శాఖకు చెందిన భూములను ఉపయోగించుకునేందుకు కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ అధికారికంగా అనుమతులు మంజూరు చేసింది.

### రక్షణ శాఖ కీలక ఉత్తర్వులు - అనుమతి మంజూరు

హైదరాబాద్‌లోని బాపు ఘాట్‌ను అప్‌గ్రేడ్ చేస్తూ గాంధీ సరోవర్ ప్రాజెక్టుగా అభివృద్ధి చేయడానికి మూసి రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కు కేంద్ర రక్షణ శాఖ వర్కింగ్ పర్మిషన్ మంజూరు చేసింది. ఈ మేరకు కేంద్ర రక్షణ శాఖ భూముల విభాగం జూన్ 18, 2026 నాటి అధికారిక లేఖ ద్వారా భారత ఆర్మీ చీఫ్ ఆఫ్ స్టాఫ్ , డిఫెన్స్ ఎస్టేట్స్ డైరెక్టర్ జనరల్‌కు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న మూసి ప్రక్షాళన ప్రాజెక్టులో భాగంగా ఈ ల్యాండ్ క్లియరెన్స్ అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది.

### రూ.533 కోట్ల విలువైన 83.814 ఎకరాల భూమి

గోల్కొండలోని ఆర్టిలరీ సెంటర్ పరిధిలో ఉన్న మొత్తం 83.814 ఎకరాల రక్షణ శాఖ భూమిని ఈ ప్రాజెక్టు కోసం ఎంఆర్‌డీసీకి అప్పగించనున్నారు. ల్యాండ్ వాల్యుయేషన్ ప్రకారం ఈ భూమి మార్కెట్ విలువ అక్షరాలా లి రూ. 533 కోట్లకు పైగా

2లో..



# రెబెల్ ఎంపీలకు టీఎంసీ షాక్

## - స్పీకర్‌కు 20 అనర్హత పిటిషన్లు





కోల్కతా (ప్రశ్న న్యూస్) పశ్చిమ బెంగాల్లో తాజా అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత తృణమూల్ కాంగ్రెస్ కు (టీఎంసీ) వరుస ఎదురుదెబ్బలు తలుగుతున్నాయి. అసలే ఓడిపోయిన బాధలో ఉన్న మమతా బెనర్జీ పార్టీలో తిరుగుబాట్లు ఎక్కువయ్యాయి. ముందు ఎమ్మెల్యేలు, ఆ తర్వాత ఎంపీలు తిరుగుబాట్లు చేశారు. అయితే ఎంపీల తిరుగుబాటును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న మమతా బెనర్జీ కీలక పావులు

2లో..

# విద్యాశాఖలో మరో విప్లవం

- విద్యా రంగాన్ని వికాసంవైపు నడిపించాలన్నదే లక్ష్యం
- ఎల్బీ స్టేడియం యంగ్ ఇండియా స్టూడెంట్ కిట్స్ పంపిణీ కార్యక్రమం
- వాట్సాప్‌లోనే మార్కుల మెమో.. ఫ్రెండ్లీ మస్కట్ పాలపిట్ట ప్రత్యేక ఆకర్షణ




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** పదేళ్లు అధికారంలో ఉన్న వాళ్లు విద్యకు ప్రాధాన్యత ఇవ్వలేదని ప్రభుత్వ పాఠశాలలు మూసివేసి విద్యా వ్యవస్థను విధ్వంసం చేశారని సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. హైదరాబాద్ ఎల్బీ స్టేడియం వేదికగా గవర్నర్ శివప్రతాప్ శుక్లాతో కలిసి ప్రభుత్వ, గురుకుల విద్యార్థులకు యంగ్ ఇండియా ఎడ్యుకేషన్

2లో..



### బ్యాంక్ స్ట్రీట్ నిర్మాణంలో

# వేగం పెంచండి

## - సీఆర్డీఏ అధికారులకు చంద్రబాబు ఆదేశం



అమరావతి (ప్రశ్న న్యూస్) రాజధాని అమరావతిలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, ముఖ్యంగా బ్యాంక్ స్ట్రీట్ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. రాజధానిని ప్రపంచ స్థాయి ప్రమాణాలతో, నివాసయోగ్యమైన నగరంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన

2లో..

### గాదె సాయి కృష్ణ తల్లికి

# సీఎం చంద్రబాబు హామీ

## - సీఐపై మర్డర్ కేసు నమోదు!

- బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ప్రభుత్వ అండ ఉంటుందని హామీ
- కేసుపై ఇప్పటికే ఉన్నతస్థాయి దర్యాప్తు జరుగుతోందని వెల్లడి
- దోషులు ఎంతటివారైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టీకరణ
- మే 9 నుంచి కనిపించకుండా పోయిన సాయి కృష్ణ



అమరావతి (ప్రశ్న న్యూస్) విజయవాడ కృష్ణలంకకు చెందిన యువకుడు గాదె సాయి కృష్ణ అదృశ్యం, లాకప్ డెత్ ఆరోపణల ఉదంతం ఆంధ్రప్రదేశ్‌లో తీవ్ర సంచలనంగా మారింది. బాధితుడి తల్లి గాదె విజయలక్ష్మి గురువారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును అమరావతిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో కలిసి తన కుమారుడికి జరిగిన అన్యాయాన్ని వివరించారు. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపించి, బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె ముఖ్యమంత్రిని వేడుకున్నారు.

### సీఎంను కలిసిన బాధితుడి తల్లి -- నిష్పక్షపాత విచారణకు హామీ

విజయవాడ కృష్ణలంకకు చెందిన గాదె సాయి కృష్ణ గత నెల రోజులుగా అదృశ్యమవగా, అతని తల్లి విజయలక్ష్మి సీఎం చంద్రబాబు నాయుడును కలిసి కన్నీటిపర్యంతమయ్యారు. తన కుమారుడిని పోలీసులు అక్రమంగా నిర్బంధించి, చిత్రహింసలు పెట్టి చంపేశారని ఆమె సీఎంకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఆమెను ఓదార్చి ధైర్యం చెప్పారు. ఈ ఘటనపై ఎలాంటి పక్షపాతం లేకుండా సమగ్ర విచారణ జరిపిస్తామని, బాధ్యులెంతటి వారైనా వదిలిపెట్టబోమని

2లో..

# తెలంగాణలో రాజకీయాలు చేస్తామంటే కుదరదు

## - పవన్ కళ్యాణ్ పై పీసీసీ చీఫ్ తీవ్ర వ్యాఖ్యలు




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో జనసేన, కాంగ్రెస్ పార్టీల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితులు కనిపిస్తున్నాయి. జూన్ 2వ తేదీన తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జనసేన పార్టీ సభకు అనుమతులు ఇవ్వకపోవడంతో ప్రారంభమైన ఆగ్రహజ్వాల రోజురోజుకూ పెరిగిపోతూనే ఉంది. తెలంగాణ ప్రభుత్వంపై, కాంగ్రెస్ పార్టీపై పవన్ కళ్యాణ్ తీవ్ర విమర్శలు గుప్పిస్తుండగా కాంగ్రెస్ నేతలు కూడా పవన్ కళ్యాణ్, జనసేనలను తూర్పారా పడుతున్నారు. దీంతో గత కొన్ని రోజులుగా తెలంగాణలో ప్రతిపక్షాల కంటే ఎక్కువగా జనసేన పార్టీ రాజకీయ వార్తల్లో నిలుస్తోంది. ఈ నేపథ్యంలోనే తాజాగా హైదరాబాద్ మణికొండలో జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యాలయాన్ని ఆ పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రారంభించగా కాంగ్రెస్ పార్టీ విమర్శలు గుప్పించింది. ఈ క్రమంలోనే టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ పవన్ కళ్యాణ్‌ను ఉద్దేశించి ఘాటు

2లో..




### మధ్యలోకి వస్తే ఖబడ్దార్..

# మళ్లీ వెంటబడి ఓడిస్తాం

## - మంత్రి శ్రీధర్ బాబుకు కవిత మాస్ వార్నింగ్

- సింగరేణి బాయిబాట కార్యక్రమంలో పాల్గొన్న కవిత
- కార్మికుల హక్కుల సాధన కోసం పోరాడుతామని భరోసా
- కార్మికులను కలవకుండా పోలీసులు ఆంక్షలు పెడుతున్నారని మండిపాటు

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో నిర్వహించిన సింగరేణి 'బాయిబాట' కార్యక్రమం తీవ్ర రాజకీయ వేడిని రగిల్చింది. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును టార్గెట్ చేస్తూ తెలంగాణ రక్షణ సమితి (టీఆర్ఎస్) అధినేత్రి కల్వకుంట్ల కవిత అత్యంత ఘాటు వ్యాఖ్యలు చేశారు. "కార్మికులకు, మాకు మధ్య రావాలని చూస్తే ఖబడ్దార్. గతంలో చేసిన తప్పులకే నిన్ను వెంటబడి

2లో..

# భూవివాదాలు లేని తెలంగాణ నిర్మాణమే లక్ష్యం

- రాష్ట్రంలో దశల వారీగా భూముల రీ-సర్వే
- వచ్చేనెల నుంచి తొలిదశలో 2240 గ్రామాల్లో ప్రారంభం

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. రాష్ట్రంలో దశల వారీగా భూముల రీసర్వే నిర్వహించాని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. భూ సమస్యలు, భూవివాదాలు లేని తెలంగాణను నిర్మించాలనే లక్ష్యంతో రాష్ట్రంలో భూ సర్వే నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా భూముల రీసర్వే కార్యక్రమాన్ని వచ్చే నెల నుంచి దశల వారీగా ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శుక్రవారం రోజున రెవెన్యూ అధికారులతో టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. రాష్ట్రంలో మొత్తం 10,954 రెవెన్యూ

2లో..



### రియల్ ఎస్టేట్ రంగంలోకి

# జెనరేటివ్ ఏఐ

## - ఇక వేగంగా ఇళ్ల నిర్మాణం!



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** మీరు కోరుకున్నట్టుగా, మీ అభిరుచులకు తగినట్టుగా సొంత ఇల్లు నిర్మించుకోవడం ఇకపై కేవలం కల కాదు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాయంతో ఇది త్వరలోనే నిజం కాబోతోంది. భవిష్యత్తులో ఇళ్ల నిర్మాణం చాలా వేగంగా, తక్కువ ఖర్చుతో, కొనుగోలుదారులకు నచ్చిన

2లో..

# ఫుట్‌పాత్‌లపై నడవడం ప్రజల ప్రాథమిక హక్కు

## - సుప్రీంకోర్టు సంచలన తీర్పు

**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** రహదారుల పక్కన కేటాయించిన ఫుట్‌పాత్‌లపై నడవడం ప్రజలకు రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు అని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. రహదారులపై వాహనాల రాకపోకల కంటే నడిచే హక్కుకే మొదటి ప్రాధాన్యత ఉంటుందని వ్యాఖ్యానించింది. భారత భూభాగంలో ఎక్కడైనా పౌరుడు స్వేచ్ఛగా తిరిగే హక్కును కల్పించే రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 (1)(డి)లో భాగంగా ఈ నడిచే హక్కు కూడా ఉంటుందని జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ ఏఎస్ చందూర్‌కర్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం తీర్పు వెలువరించింది. ఆర్టికల్ 19 (1)(ఏ), 19(1)(బి), 19(1)(సి), భావప్రకటన స్వేచ్ఛను కల్పించే ఆర్టికల్ 21తో కలిపి చదవాలని కూడా ధర్మాసనం పేర్కొంది."ఒక రహదారి ఉందంటే దాని పక్కన పాదచారుల కోసం ఫుట్‌పాత్‌ను ఏర్పాటుచేసి, సక్రమంగా నిర్వహించాల్సి బాధ్యత కచ్చితంగా ఉంది ఇది చట్టపరంగా

2లో..



### గ్లోబల్ మార్కెట్‌లో

# భారత విస్కీ హవా

## - స్కాచ్‌కు దీటైన పోటీ!



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ప్రపంచ విస్కీ మార్కెట్‌లో భారత సింగిల్ మాల్ట్‌లు ప్రభంజనం సృష్టిస్తున్నాయి. ఇండియన్ విస్కీ బ్రాండ్లను ఒకప్పుడు స్కాచ్, ఐరిష్ విస్కీలకు ప్రత్యామ్నాయంగా చూసిన ప్రపంచం, ఇప్పుడు వాటి నాణ్యతను, ప్రత్యేకతను గుర్తిస్తోంది. స్కాచ్, జపనీస్ విస్కీల సరసన భారతీయ బ్రాండ్లు కూడా నిలబడుతూ అంతర్జాతీయ వేదికపై తమదైన ముద్ర వేస్తున్నాయి. భారత విస్కీల విశిష్టతకు ఇక్కడి ఉష్ణమండల వాతావరణమే ప్రధాన కారణం. గోవా వంటి వేడి, తేమతో కూడిన ప్రాంతాల్లో ఓక్ పీపాల్లో నిల్వ ఉంచినప్పుడు

2లో..

# మూసీ రివర్ ఫ్రంట్‌కు గ్రీన్ సిగ్నల్

ఉంటుందని రక్షణ శాఖ లెక్కగట్టింది. గండిపేట, రాజేంద్రనగర్, గోల్కొండ మండలాల పరిధిలోని బండ్లగూడ, హైదర్‌గూడ, ఖిల్లా మహ్మద్ నగర్ గ్రామాల్లో విస్తరించి ఉన్న పాకెట్ 2 డ 3, పాకెట్ 4, పాకెట్ 5, పాకెట్ 6లా భూములను ఈ గాంధీ సరోవర్ ప్రాజెక్టు కోసం కేటాయించారు.

### ఈవీఐ విధానంలో ల్యాండ్ సెటిల్‌మెంట్

ఈ భూముల బదిలీ ప్రక్రియను రక్షణ శాఖ ఒక ప్రత్యేక నిబంధనపై మంజూరు చేసింది. ఈక్వల్ వాల్యూ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ విధానం ప్రాతిపదికన ఈ వర్కింగ్ పర్మిషన్ లభించింది. అంటే రక్షణ శాఖకు చెందిన లోకల్ మిలిటరీ అథారిటీ కి ఈ భూమికి బదులుగా సమాన విలువ కలిగిన మౌలిక సదుపాయాలను భవనాలు, రోడ్లు లేదా ఇతర మౌలిక వసతులు రాష్ట్ర ప్రభుత్వం నిర్మించి ఇవ్వాల్సి ఉంటుంది. రక్షణ శాఖ 2016 నాటి పాలసీ నిబంధనల ప్రకారం ఈ ఒప్పందం కుదిరింది.

### పర్యాటక, ఆధ్యాత్మిక హబ్‌గా బాపు ఘాట్

మూసి నది , ఈసీ నదులు సంగమించే లొకేషన్‌లో ఉన్న బాపు ఘాట్ వద్ద ఈ గాంధీ సరోవర్ ప్రాజెక్టు రాబోతోంది. మహాత్మా గాంధీ అస్థికలను కలిపిన పవిత్ర స్థలమైన బాపు ఘాట్‌ను ప్రపంచ స్థాయి పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దాలన్నది ప్రభుత్వ సంకల్పం. ఇక్కడ భారీ జలాశయం తో పాటు గాంధీజీ సిద్ధాంతాలను ప్రతిబింబించేలా విజ్ఞాన కేంద్రాలు, సుందరమైన పార్కులు, వాకింగ్ ట్రాక్‌లు, మరియు పర్యాటకులను ఆకట్టుకునేలా బోటింగ్ సౌకర్యాలను నిర్మించనున్నారు.

### మూసి పునరుజ్జీవనానికి భారీ బూస్ట్

కేంద్ర ప్రభుత్వం నుండి లభించిన ఈ క్లియరెన్స్‌తో మూసి రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ పనుల వేగం పుంజుకోనుంది. గతంలో రక్షణ భూముల సేకరణ పెద్ద అడ్డంకిగా మారగా, ఇప్పుడు కేంద్ర రక్షణ శాఖ సానుకూలంగా స్పందించి పచ్చజెండా ఊపడంతో ప్రాజెక్టు డిజైన్ల అమలుకు మార్గం సుగమమైంది. కేవలం పర్యాటక రంగమే కాకుండా నగరంలోని పర్యావరణ సమతుల్యతను కాపాడటానికి, మూసి నదిని మురికికూపంగా మార్చే డ్రైనేజీ ప్రవాహాలను అడ్డుకుని, స్వచ్ఛమైన జలాలతో ఈ సరోవరాన్ని నింపేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

# రెబెల్ ఎంపీలకు టీఎంసీ షాక్

కదుపుతున్నారు. ఇందులో భాగంగా ఆమె మేనల్లుడు, టీఎంసీ లోక్ సభాపక్ష నేత అభిషేక్ బెనర్జీ స్పీకర్ ఓం బిర్లాను కలిశారు.టీఎంసీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ అభిషేక్ బెనర్జీ లోక్ సభ స్పీకర్ ఓం బిర్లాను కలిసి తమ పార్టీతో విభేదిస్తూ ఎన్సీపీఐలో విలీనానికి సిద్ధమైన 20 మంది రెబెల్ ఎంపీలపై అనర్హత వేటు వేయాలని కోరారు. ఇప్పటికే రెబెల్ ఎంపీల వాదన విన్న స్పీకర్ అభిషేక్ బెనర్జీ అభిప్రాయం కూడా తీసుకున్నారు. అనంతరం వీరి అనర్హత వేటుకు ఆమోద ముద్ర వేయడమా లేక విలీనానికా అన్నది తేల్చబోతున్నారు. అయితే మూడొంతుల మంది సభ్యులు ఫిరాయిస్తే వేరే వర్గంగా గుర్తించవచ్చన్న వాదనతో రెబెల్స్ ఎన్సీపీఐలో విలీనానికి సిద్ధమవుతున్న వేళ అభిషేక్ బెనర్జీ స్పీకర్ ను కలిశాక మీడియాతో మాట్లాడారు.టీఎంసీకి చెందిన 20 మంది ఎంపీలు 3-4 రోజుల క్రితం స్పీకర్‌ను కలిసి, తాము ఒక ప్రత్యేక సమూహంగా ఏర్పడినట్లు పేర్కొన్నారని, మీడియా కథనాల ప్రకారం, తమను ఒక ప్రత్యేక సమూహంగా పరిగణించాలని వారు కోరారని ఆయన తెలిపారు. ఆ తర్వాత కొద్ది గంటలకే, వారిలో 2-4 మంది తాము ఎన్సీపీఐలో విలీనమయ్యామని ప్రకటించారన్నారు. అసలు ఆ పార్టీ గురించి తమకు ఎవరికీ తెలియదన్నారు. టీఎంసీ తరపున లోక్‌సభలో పార్టీ నాయకుడిగా, తాను వారిపై 20 వేర్వేరు అనర్హత పిటిషన్లను సమర్పించానన్నారు. ప్రత్యేక సమూహంగా ఏర్పడ్డామని చెప్పుకుంటున్న వీరికి వ్యతిరేకంగా రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్ నిబంధనలు ఉన్నాయని,వారికి కనీస నిజాయితీ ఉన్నా, వారు తమ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

# విద్యాశాఖలో మరో విప్లవం

కిట్ల పంపిణీకి శ్రీకారం చుట్టారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. విద్యా శాఖకు మంత్రి లేడంటూ కొందరు మాట్లాడుతున్నారని పదేళ్లు వాళ్లు చేసిన విధ్వంసంతో వందేళ్ల నష్టం జరిగిందని అన్నారు. అందుకే విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేసి పేదలకు విద్య అందించాలని విద్యా శాఖను నా దగ్గరే పెట్టుకున్నానని స్పష్టం చేశారు."అరవై ఏళ్ల సుదీర్ఘ పోరాటం, వందలాది మంది యువత ఆత్మ బలిదానాలతో తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. తెలంగాణ భవిష్యత్ తరగతి గదుల్లోనే ఉందని మేం సంపూర్ణంగా విశ్వసించాం. విధ్వంసమైన విద్యా వ్యవస్థను వికాసం వైపు నడిపించాలని నిర్ణయించాం. అందుకే బడ్జెట్ లో విద్య కోసం 8.5 శాతం నిధులు కేటాయించాం. విద్యాభివృద్ధికి రూ. 26,600 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. ఇది ఖర్చుగా కాదు భవిష్యత్ తరాల కోసం పెట్టుబడిగా మేం భావిస్తాం" అని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు."పదేళ్లు అధికారంలో ఉన్నవాళ్లు డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచలేదు. మేం అధికారంలోకి రాగానే డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచాం. ప్రభుత్వ పాఠశాలలు మూసివేసి విద్యా వ్యవస్థను విధ్వంసం చేశారు. విద్యా శాఖకు మంత్రి లేడంటూ కొందరు మాట్లాడుతున్నారు. పదేళ్లు వాళ్లు చేసిన విధ్వంసంతో వందేళ్ల నష్టం జరిగింది. అందుకే విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేసి పేదలకు విద్య అందించాలని విద్యా శాఖను నా దగ్గరే పెట్టుకున్నా" అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. "ప్రీ ప్రైమరీ విధానం తీసుకొచ్చి ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను పునరుద్ధరిస్తున్నాం. ప్రభుత్వ పాఠశాలల్లో నో అడ్మిషన్ బోర్డు పెట్టాల్సి వస్తుందని ఎవ్వరూ కలలో కూడా ఊహించి ఉండరు. ఆరుట్ల పబ్లిక్ స్కూల్ ఏర్పాటుతో అలాంటి అసాధ్యాన్ని సుసాధ్యం చేసి చూపించాం. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మించి దేశానికే ఆదర్శంగా తెలంగాణను నిలపబోతున్నాం. రాబోయే ఒలంపిక్స్ లక్ష్యంగా యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశాం" అని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

ఏఐ తుఫాన్ తో కోట్లాది మంది నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారు. అందుకే బ్లూ కాలర్ జాబ్స్ వైపు దృష్టి సారించాం. యువతకు నైపుణ్య శిక్షణ అందించే కార్యక్రమాన్ని చేపట్టాం ఇంగ్లీష్ తో పాటు జర్మనీ, జపాన్ భాషను నేర్పిస్తున్నాం. ఐటీఐలను ఏటీసీలుగా మార్చాం స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేసుకున్నాం. మీలో ఉన్న నైపుణ్యాన్ని వెలికితీసి పదును పెట్టి గొప్ప వాళ్లుగా తీర్చిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుంది" అని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. "సోషల్ వెల్ఫేర్ లో చదువుకున్న విద్యార్థులు డాక్టర్లుగా, ఐఏఎస్ లుగా, ఐపీఎస్ లుగా, రాజకీయ నాయకులుగా ఎదగాలి. మీరంతా తెలంగాణ పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలి. దేశాన్ని నడిపించే శక్తిగా ఎదగాలి. రేపటి భవిష్యత్ తరగతి గదుల్లోనే ఉంది. మీ తలరాతను మార్చేది చదువొక్కటే. మీరు చదవండి మీకు ఏం కావాలో ఇచ్చే బాధ్యత మీ రేవంతన్న తీసుకుంటాడు. 27.50 లక్షల మంది విద్యార్థులకు యంగ్ ఇండియా స్టూడెంట్ కిట్స్ అందిస్తున్నాం. తెలంగాణను ఎడ్యుకేషన్ హబ్ గా, స్పోర్ట్స్ హబ్ గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నాం" అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. అలాగే పాఠశాలలు, కళాశాలలను మాదకద్రవ్య రహితంగా తీర్చిదిద్దాలనే సమున్నత లక్ష్యంతో గవర్నర్ శివప్రతాప్ శుక్లా 15 వేల మంది విద్యార్థులతో సామూహిక ప్రతిజ్ఞ చేయించారు.

## బ్యాంక్ స్ట్రీట్ నిర్మాణంలో

# వేగం పెంచండి

అన్ని చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. సీఎం క్యాంపు కార్యాలయంలో చంద్రబాబు అధ్యక్షతన సీఆర్డీఏ అథారిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాజధాని అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించి, అధికారులకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. సమావేశంలో ప్రధానంగా ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని బ్యాంక్ స్ట్రీట్ నిర్మాణ పురోగతిపై సమీక్షించారు. బ్యాంకుల ప్రధాన కార్యాలయాల నిర్మాణానికి అవసరమైన అనుమతుల ప్రక్రియలో ఎలాంటి జాప్యం జరగకూడదని చంద్రబాబు స్పష్టం చేశారు. బ్యాంక్ స్ట్రీట్‌లో కార్యాలయాల ఏర్పాటుకు 13 బ్యాంకులు ముందుకు రాగా, వాటిలో 11 సంస్థలు తమ భవన నిర్మాణ బాధ్యతలను సీపీడబ్ల్యూడీకి అప్పగించాయని అధికారులు సీఎంకు వివరించారు. ఈ నిర్మాణాలను పూర్తి సమన్వయంతో వేగంగా పూర్తి చేసేలా చూడాలని సీఆర్డీఏ అధికారులకు సూచించారు. రాజధానిలో డిజిటల్ మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని ముఖ్యమంత్రి అన్నారు. ఫోన్, కేబుల్, ఇంటర్నెట్ వంటి కనెక్టివిటీ సేవల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఇందుకోసం ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ) విధానంలో డిజిటల్ వసతులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అమరావతిని కేవలం నిర్మించడమే కాకుండా, నివాస వ్యయాన్ని తగ్గించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పైప్డ్ గ్యాస్ కనెక్షన్లు, ఇండక్షన్ స్టవ్‌ల వాడకాన్ని ప్రోత్సహించడం, డిస్ట్రిక్ట్ కూలింగ్ వంటి ఆధునిక వ్యవస్థలను అందుబాటులోకి తేవడం ద్వారా ఇది సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు. రాజధాని సుందరీకరణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని చంద్రబాబు చెప్పారు. ప్రకాశం బ్యారేజీకి ఎగువన వైకుంఠపురం వరకు ఏడాది పొడవునా నీరు నిల్వ ఉండేలా చూడటం ద్వారా పర్యాటక అభివృద్ధికి అపార అవకాశాలు ఉంటాయని అన్నారు. జల క్రీడలు, స్విమ్మింగ్ వంటి కార్యకలాపాలను ప్రోత్సహించవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో కృష్ణా కరకట్ట నిర్మాణం, ఉండవల్లిలో ఎల్పీఎస్ లేఅవుట్ల అభివృద్ధి, పార్కింగ్ కాంప్లెక్స్, జ్యుడీషియల్ అకాడమీ నిర్మాణం వంటి ఇతర అంశాలపై కూడా చర్చించారు. ఈ సమావేశంలో మంత్రి నారాయణ వర్చువల్‌గా పాల్గొనగా, మున్సిపల్, సీఆర్డీఏ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# గాదె సాయి కృష్ణ తల్లికి సీఎం చంద్రబాబు హామీ

చంద్రబాబు గట్టి హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి స్పందన పట్ల విజయలక్ష్మి సంతృప్తి వ్యక్తం చేస్తూ, తమకు న్యాయం జరుగుతుందనే నమ్మకం కలిగిందని మీడియాకు తెలిపారు.

### అసలేం జరిగింది? -- కస్టడీ డెత్ ఆరోపణలు

పోలీసు రికార్డుల ప్రకారం గాదె సాయి కృష్ణపై క్రిమినల్ కేసులు ఉన్నాయి. అయితే, పోలీసుల నుంచి తప్పించుకునేందుకు అతను ప్రకాశం జిల్లా మార్కాపురంలో నివాసం ఉంటున్నాడు. మే 9, 2026 న కృష్ణలంక పోలీసులు మార్కాపురం వెళ్లి సాయి కృష్ణను అదుపులోకి తీసుకున్నారని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఆ తర్వాత అతను ఇంటికి తిరిగి రాలేదు, పోలీసు స్టేషన్ లోనూ చూపించలేదు. అప్పటి కృష్ణలంక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి. నాగరాజు ఆధ్వర్యంలో సాయి కృష్ణను స్టేషన్‌లో దారుణంగా కొట్టి చంపేసి, సాక్ష్యాలు దొరక్కుండా మృతదేహాన్ని తగలబెట్టేశారని తల్లి విజయలక్ష్మి తీవ్ర ఆరోపణలు చేశారు.

### సీసీటీవీ ఫుటేజ్ భద్రపరచాలని ఆదేశం

పోలీసులు తమ కుమారుడిని కోర్టులో ప్రవేశపెట్టడం లేదంటూ విజయలక్ష్మి అంతకుముందు ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో హేబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై తీవ్రంగా స్పందించిన హైకోర్టు.. జూన్ 29 లోగా సాయి కృష్ణను కోర్టు ముందు ప్రవేశపెట్టాలని పోలీసు యంత్రాంగాన్ని ఆదేశించింది. మరోవైపు విజయవాడ స్థానిక కోర్టు కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లోని మే 1 నుండి జూన్ 1 వరకు ఉన్న అన్ని సీసీటీవీ కెమెరాల హార్డ్ డిస్క్‌లు, డీవీఆర్ లు, సర్వర్లను వెంటనే సీజ్ చేసి భద్రపరచాలని సంచలన ఆదేశాలు జారీ చేసింది.

### సీఐపై మర్డర్ కేసు

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఈ కేసును అత్యంత తీవ్రంగా పరిగణించి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. సీఎం ఆదేశాల మేరకు ఆరోపణలు ఎదుర్కొంటున్న కృష్ణలంక సీఐ నాగరాజును తక్షణమే సస్పెండ్ చేశారు. అలాగే ఈ కేసును నిష్పక్షపాతంగా తేల్చేందుకు తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ, సీనియర్ ఐపీఎస్ అధికారి డి. నరసింహ కిషోర్‌ను ప్రత్యేక విచారణ అధికారిగా నియమించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు సస్పెండైన సీఐ నాగరాజుపై భారతీయ న్యాయ సంహిత కింద అక్రమ నిర్బంధం, హత్య , సాక్ష్యాల విధ్వంసం కింద హత్యానేరం కేసు నమోదు చేశారు.

### రాజకీయ రంగు పులుముకున్న ఉదంతం

ఈ లాకప్ డెత్ ఆరోపణల ఉదంతం ఏపీలో రాజకీయంగానూ వేడి పుట్టించింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కృష్ణలంకలోని సాయి కృష్ణ నివాసానికి వెళ్లి బాధితుడి కుటుంబాన్ని పరామర్శించారు. చట్టాన్ని రక్షించాల్సిన పోలీసులే ఇలాంటి దారుణానికి ఒడిగట్టడం దారుణమని, కేవలం ఒక సీఐని సస్పెండ్ చేస్తే సరిపోదని, దీనిపై సీబీఐ ( విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. అయితే, ప్రభుత్వం మాత్రం ఐపీఎస్ అధికారి నేతృత్వంలో సిట్ విచారణను వేగవంతం చేసింది.

# ఫుట్‌పాత్‌లపై నడవడం ప్రజల ప్రాథమిక హక్కు

అమలు చేయాల్సి బాధ్యత" అని ధర్మాసనం అభిప్రాయపడింది. రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన ఐదేళ్ల బాలుడి పరిహారానికి సంబంధించిన కేసు విచారణ సందర్భంగా కోర్టుపై విధంగా స్పందించింది. బాలుడ్ని తన తండ్రి ఉదయం 9 గంటలప్పుడు స్కూల్‌కు నడుచుకుని తీసుకెళ్తుండగా ట్యాంకర్ వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆ చిన్నారి ప్రాణాలు కోల్పోయాడు. ఆ ప్రాంతంలో ఎటువంటి ఫుట్‌పాత్‌లు కానీ, రోడ్డు దాటడానికి క్రాసింగ్‌లు కానీ లేవు.ఈ కేసులో మృతిచెందిన బాలుడి తండ్రికి చెల్లించే పరిహారాన్ని రూ.11,44,628కు పెంచిన సుప్రీం కోర్టు దీనిని రెండు నెలల్లో చెల్లించాలని ఆదేశించింది. పరిహారాన్ని తగ్గిస్తూ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను పక్కనబెట్టింది. "ప్రత్యేకంగా కేటాయించిన ఫుట్‌పాత్‌లపై నడిచే హక్కుకు భంగం కలిగితే పౌరులు తమ హక్కుల పునరుద్దరణ, పరిహారం కోసం బాధ్యులైన అధికారులపై చట్టపరమైన పరిష్కారాలను ఆశ్రయించవచ్చు నష్టపరిహారం కోరవచ్చు అయితే ఈ పరిహారం మోటారు వాహనాల చట్టం 1988లతో సంబంధం లేకుండా స్వతంత్రంగా ఉంటుంది" అని ధర్మాసనం పేర్కొంది.సౌకర్యవంతమైన, సురక్షితమైన ఫుట్‌పాత్ లేకపోవడం, వాటిని వాహనాల రాకపోకల కోసం వదిలేయడం అనేది చాలా కాలంగా ఎదుర్కొంటున్న సమస్య అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. దేశంలో నగరాలు, పట్టణాల ప్రణాళికలు వాహనాలకు అధిక ప్రాధాన్యతనిస్తూ రూపొందించారని, దీనివల్ల పాదచారులు దుర్బలమైన స్థితిలో ఉన్నారని కోర్టు తెలిపింది.పట్టణాభివృద్ధి క్రమంగా మోటారు వాహనాల రాకపోకలకు ఎలా అనుకూలంగా మారిందో కోర్టు వివరించింది. చక్రాలు కనుగొనక ముందే మానవులు నకడ ప్రారంభించారని, ఆర్టికల్ 19(1)(డి) ప్రకారం సంచార హక్కు నడిచే ప్రాథమిక హక్కేనని అది వ్యాఖ్యానించింది. ఈ హక్కు వాహనాల వినియోగానికి ముందే అందుబాటులో ఉంది కాబట్టి, సురక్షితమైన, ప్రత్యేకంగా కేటాయించిన ఫుట్‌పాత్‌లను పొందే హక్కు కచ్చితంగా అంతర్భాగమై ఉంటుందని తేల్చిచెప్పింది.


# గ్లోబల్ మార్కెట్‌లో భారత విస్కీ హవా

విస్కీ చాలా వేగంగా పరిపక్వత చెందుతుంది. దీనివల్ల స్కాట్లాండ్ వంటి చల్లని ప్రాంతాల్లో తయారయ్యే విస్కీల కంటే భిన్నంగా, గాఢమైన పండ్ల సువాసనలతో ప్రత్యేకమైన రుచిని సంతరించుకుంటుంది.హిమాలయాల దిగువన పండే బార్లీని ఉపయోగించి, ఇతర దేశాల శైలులను అనుకరించకుండా, పూర్తిగా దేశీయ పద్ధతిలో ఇండియన్ బ్రాండ్ విస్కీలు తయారుచేస్తున్నారు. ప్రస్తుతం వినియోగదారులు ప్రామాణికమైన, ప్రాంతీయ నేపథ్యం ఉన్న ఉత్పత్తుల వైపు మొగ్గు చూపుతున్నారు. జపనీస్ విస్కీలు ఎలాగైతే ఆ దేశ ఖ్యాతిని పెంచాయో, ఇప్పుడు భారత సింగిల్ మాల్ట్‌లు కూడా అదే పని చేస్తున్నాయి. కేవలం అతిపెద్ద వినియోగదారుల మార్కెట్‌గానే కాకుండా, నాణ్యమైన, విలాసవంతమైన ఉత్పత్తులను తయారుచేసే దేశంగా భారత్‌కు గుర్తింపు తెస్తున్నాయి. భారతీయ విస్కీలు ఒక నిర్ణయాత్మక శకంలోకి ప్రవేశిస్తున్నాయని, భవిష్యత్తులో ప్రామాణికతే కీలక పాత్ర పోషిస్తుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## శిథిలావస్థకు చేరిన

# అంగన్‌వాడీ పాత భవనం

- **వర్షపు నీటితో చిన్నారుల అవస్థలు**
- **గిర్మాపూర్‌లో నూతన అంగన్‌వాడీ భవనాన్ని మంజూరు చేయాలి**
- **ఎంపీ ఈటల రాజేందర్‌కు బీజేపీ నాయకుల వినతి**



మేడ్చల్ (ప్రశ్న న్యూస్ ) మేడ్చల్ సర్కిల్ కార్యాలయంలో పరిధిలోని గిర్మాపూర్ గ్రామంలో నూతన అంగన్‌వాడీ భవన నిర్మాణానికి తగిన నిధులు మంజూరు చేయాలని కోరుతూ మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్‌కు గిర్మాపూర్ బీజేపీ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గిర్మాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రస్తుతం నడుస్తున్న అంగన్‌వాడీ కేంద్రం పూర్తిగా శిథిలావస్థకు చేరిందని నాయకులు ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభం కావడంతో, స్వల్ప వర్షానికే పైకప్పు నుండి నీరు కారి భవనంలో నిలిచిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల చిన్నారులు, గర్భిణులు, అంగన్‌వాడీ సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. చిన్నారుల భద్రత దృష్ట్యా తక్షణమే స్పందించి నూతన భవన నిర్మాణానికి నిధులు కేటాయించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ పురపాలక మాజీ బీజేపీ అధ్యక్షులు కొండం ఆంజనేయులు ముదిరాజ్, బీజేపీ సీనియర్ నాయకులు వంగేటి హనుమంత్ రెడ్డి, చీర్ల సత్యనారాయణ, డివిజన్ బీజేపీ కార్యదర్శులు బండి విష్ణు గౌడ్, బొక్క సురేందర్ రెడ్డి, బూత్ అధ్యక్షులు బండి బాబు గౌడ్, జిల్లా బీజేవైఎం కార్యదర్శి రాఘవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




# బ్యాంక్ స్ట్రీట్ నిర్మాణంలో వేగం పెంచండి

గ్రామాలున్నాయని తెలిపారు. తొలి దశలో 32 జిల్లాల (హైదరాబాద్ మినహా) నుంచి 70 గ్రామాల చొప్పున మొత్తం 2240 గ్రామాలను ఎంపిక చేసి రీసర్వే చేపట్టనున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.భూమి రైతుకు కేవలం ఆస్తి మాత్రమే కాదని అది అతని జీవనాధారమని ప్రతి అంగుళం భూమికి స్పష్టమైన హద్దులు, ప్రతి సర్వే నంబర్‌కు భూదార్, ప్రతి రైతుకు భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొంగులేటి తెలిపారు. తెలంగాణను భూ వివాదాలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ఈ రీ-సర్వే కార్యక్రమం చారిత్రాత్మక మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇప్పటికీ అనేక ప్రాంతాల్లో 1936 నాటి నిజాం కాలం సర్వే రికార్డులే ప్రధాన ఆధారంగా ఉన్నాయని కాలక్రమేణా భూముల విభజనలు, ఉపసంఖ్యలు పెరగడం, పట్టణీకరణ విస్తరించడం, పరిపాలనా సరిహద్దులు మారడం వల్ల అనేక ప్రాంతాల్లో భూముల అసలు హద్దులపై స్పష్టత లేకుండా పోయిందన్నారు. ఈ పరిస్థితులకు శాశ్వత పరిష్కారం చూపేందుకే ప్రభుత్వం సమగ్ర రీ-సర్వే చేపడుతోందని తెలిపారు.భూ వివాదాల పరిష్కారంలో భాగంగా రాష్ట్రంలో నిజాం కాలం నుంచి నక్షాలు లేని 378 గ్రామాలను గుర్తించామని వాటిలో ఇప్పటికే 5 గ్రామాల్లో రీ-సర్వే పూర్తి చేసి భూదార్ నంబర్లు కేటాయించినట్లు తెలిపారు. మిగిలిన 373 గ్రామాల్లో కూడా రోవర్స్ వంటి ఆధునిక సాంకేతికతతో సర్వే పనులు వేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. గొలుసులు, కర్రలు, క్రాస్ స్టాఫ్, మెజరింగ్ టేప్ వంటి పాత సర్వే పరికరాలకు పూర్తిగా స్వస్తి చెబుతున్నామని మంత్రి తెలిపారు. డీజీపీఎస్, రోవర్స్, జీఐఎస్, క్యూజీఐఎస్ వంటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ శాస్త్రీయ పద్ధతిలో భూముల సర్వే నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇప్పటికే 411 రోవర్స్ కొనుగోలు చేయగా, త్వరలో మరో 400 రోవర్స్ కొనుగోలు చేయనున్నట్లు వెల్లడించారు.

### ప్రతి సర్వే నంబర్‌కు భూదార్..

భూముల రీ-సర్వే పూర్తయిన తర్వాత ప్రతి భూకమతానికి ఖచ్చితమైన హద్దులను నిర్ణయించి, ప్రతి సర్వే నంబర్‌కు ప్రత్యేక భూదార్ నంబర్ కేటాయించనున్నట్లు మంత్రి తెలిపారు. ఆధార్ తరహాలో ప్రతి భూమికి ప్రత్యేక గుర్తింపుగా భూదార్ కార్డులు జారీ చేస్తామని చెప్పారు. డీజీపీఎస్ ద్వారా సేకరించిన సమాచారాన్ని క్యూజీఐఎస్ సాఫ్ట్‌వేర్‌లో నిక్షిప్తం చేసి భూ భారతి పోర్టల్‌లో నమోదు చేయనున్నట్లు తెలిపారు.తెలంగాణ ప్రాంతంలో 1948 నాటికి సుమారు 40 లక్షల సర్వే నంబర్లు ఉండగా ప్రస్తుతం అవి 2 కోట్ల 29 లక్షలకు పెరిగాయని రాష్ట్రంలోని అన్ని సర్వే నంబర్లకు దశలవారీగా భూదార్ నంబర్లు కేటాయించేందుకు ప్రభుత్వం సమగ్ర కార్యాచరణ రూపొందించిందన్నారు.రీ-సర్వే కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు అవసరమైన మానవ వనరులను ప్రభుత్వం సమకూర్చిందని 5,520 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లకు శిక్షణ ఇచ్చి లైసెన్సులు జారీ చేశామని, భూవిస్తీర్ణాన్ని బట్టి ప్రతి మండలానికి 4 నుంచి 6 మంది సర్వేయర్లను నియమించామని చెప్పారు. రాష్ట్రంలోని రెవెన్యూ గ్రామాలను క్లస్టర్లుగా విభజించి ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. భూముల రీ-సర్వే పూర్తయిన తర్వాత ప్రతి కమతానికి ఖచ్చితమైన సరిహద్దులు, ప్రత్యేక పటాలు సిద్ధమవుతాయని, తద్వారా భూ యాజమాన్యంపై ఎలాంటి వివాదాలకు తావు ఉండదన్నారు. భూ భారతి చట్టం ద్వారా సాగు భూముల రిజిస్ట్రేషన్లకు సర్వే పటం తప్పనిసరి చేసిన నేపథ్యంలో రీ-సర్వే ద్వారా భూముల రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ ప్రక్రియలు మరింత పారదర్శకంగా, వేగవంతంగా మారనున్నాయని తెలిపారు.

# తెలంగాణలో రాజకీయాలు చేస్తామంటే కుదరదు

వ్యాఖ్యలు చేశారు. పవన్ కళ్యాణ్ వచ్చినా, కమల కళ్యాణ్ వచ్చినా బాధ లేదని పేర్కొన్నారు. పవన్ కళ్యాణ్‌కు ఎవరితో ఎలాంటి సమస్య ఉందో దాంతో తమకు ఎలాంటి సంబంధం లేదని తేల్చి చెప్పారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ పాలనలో తెలంగాణ ప్రజలు సంతోషంగా ఉన్నారని తెలిపారు. తెలంగాణకు సామరస్యంగా వస్తే తమ ఇంటికి పిలిచి మరీ భోజనాలు పెట్టిస్తానని పేర్కొన్న మహేష్ కుమార్ గౌడ్ రాజకీయాలు చేస్తామంటే మాత్రం నడవనీయమని తేల్చి చెప్పారు.ఇక ఆంధ్రప్రదేశ్‌లో అధికార కూటమిలో భాగంగా ఉన్న జనసేన తెలంగాణలో కూడా పార్టీని పటిష్ఠం చేయాలని నిర్ణయించుకుంది. త్వరలోనే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) ఎన్నికలు రానుండగా జనసేన పార్టీ కూడా ఈ ఎన్నికల్లో పోటీ చేస్తుందని ఇప్పటికే ప్రకటించిన పవన్ కళ్యాణ్.. ఆ దిశగా తెలంగాణలో జనసేన కార్యక్రమాలపై దృష్టి పెట్టారు. జూన్ 2వ తేదీన సభకు అనుమతి లేకపోవడంతో ప్రెస్‌మీట్ పెట్టి తీవ్ర వ్యాఖ్యలు చేసిన పవన్ కళ్యాణ్ ఆ తర్వాత సందర్భం వచ్చిన ప్రతీసారి విమర్శల దాడిని పెంచుతున్నారు.ఈ నేపథ్యంలోనే ఇటీవల ఢిల్లీలో నిర్వహించిన సేన ప్రస్థానంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై పవన్ కళ్యాణ్ విమర్శలు చేశారు. ఆ తర్వాత అరుదైన వ్యాధితో బాధపడుతున్న తన అభిమాని నిరంజన్ తనను కలవాలి అని ఉందనే చివరి కోరికను నెరవేర్చేందుకు హనుమకొండలో పర్యటించి నిరంజన్ ఇంటికి వెళ్లి అతడిని పరామర్శించారు. తాజాగా మణికొండలో జనసేన పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించి తెలంగాణపై పూర్తి ఫోకస్ పెట్టినట్లు హింట్ ఇచ్చారు. తెలంగాణలో జనసేన పార్టీ ఉనికిని చాటుకునేందుకు క్షేత్రస్థాయిలో క్యాడర్‌ను బలోపేతం చేస్తామని ప్రకటించిన పవన్ అవసరం అయితే తానే రంగంలోకి దిగుతానని తేల్చి చెప్పారు. దీంతో తెలంగాణ జనసేన నేతల్లో సరికొత్త ఉత్సాహం నెలకొంది.

# రియల్ ఎస్టేట్ రంగంలోకి జెనరేటివ్ ఏఐ

విధంగా జరగనుంది. ఈ మార్పులకు జెనరేటివ్ ఏఐ సాంకేతికత నాంది పలుకుతోందని నిపుణులు చెబుతున్నారు. ఈవై-పార్థినాన్, క్రెడాయ్ సంస్థలు సంయుక్తంగా విడుదల చేసిన 'జెన్‌ఏఐ ఇన్ ఇండియన్ రియల్ ఎస్టేట్' నివేదిక ఈ ఆసక్తికర విషయాలను వెల్లడించింది. రాబోయే ఏడేళ్లలో జెనరేటివ్ ఏఐ వల్ల భారత రియల్ ఎస్టేట్ రంగానికి 14 నుంచి 17 బిలియన్ డాలర్ల అదనపు విలువ చేకూరనుందని ఈ నివేదిక అంచనా వేసింది. ఇది నిర్మాణ రంగంలో విప్లవాత్మక మార్పులకు దారితీయనుంది.ఏఐ టెక్నాలజీ వినియోగంతో ప్రాజెక్టుల ప్రణాళిక, డిజైన్, నిర్మాణం వంటివి వేగవంతం అవుతాయి. అమ్మకాల్లో 30-50 శాతం వృద్ధి, ప్రాజెక్టులను 30 శాతం వేగంగా ప్రారంభించడం సాధ్యమవుతుంది. భూమిని సేకరించిన నాటి నుంచి ప్రాజెక్ట్ మొదలుపెట్టే వరకు పట్టే సమయం 20-30 శాతం తగ్గుతుంది. ఫలితంగా నిర్మాణ వ్యయం, సమయం 5-20 శాతం వరకు ఆదా అవుతుంది. ఈ టెక్నాలజీతో కొనుగోలుదారుల అభిరుచులను విశ్లేషించి, వారికి తగ్గట్టుగా ఇళ్ల డిజైన్లను రూపొందించవచ్చు. ఏఐ ఆధారిత వర్చువల్ అసిస్టెంట్లు ఇంటిని ఎంచుకోవడంలో సాయపడతాయి. "జెన్‌ఏఐ కేవలం సామర్థ్యాన్ని పెంచడమే కాకుండా, ఇల్లు కొనే ప్రక్రియ మొత్తాన్ని మరింత మెరుగుపరుస్తుంది" అని క్రెడాయ్ అధ్యక్షుడు శేఖర్ జి పటేల్ తెలిపారు. ఏఐ రాకతో సంస్థల విలువ 2-3 రెట్లు పెరిగే అవకాశం ఉందని ఈవై-పార్థినాన్ ప్రతినిధి చైతన్య సేథ్ వివరించారు. మొత్తం మీద, ఏఐ ఇకపై ప్రయోగం కాదు, నిర్మాణ రంగంలో ఒక ముఖ్యమైన సాధనంగా మారబోతోంది.

## మధ్యలోకి వస్తే ఖబడ్దార్..

# మళ్లీ వెంటబడి ఓడిస్తాం

ఓడించాం. మళ్లీ అదే పునరావృతమైతే వచ్చే ఎన్నికల్లోనూ నిన్ను వెంటాడి మరీ ఓడిస్తాం" అంటూ మంత్రి శ్రీధర్ బాబుకు ఆమె మాస్ వార్నింగ్ ఇచ్చారు. బాయిబాట కార్యక్రమంలో భాగంగా కల్వకుంట్ల కవిత అడ్రియాల లాంగ్ వాల్ ప్రాజెక్టు అండర్‌గ్రౌండ్ మైన్‌లోకి దిగి కార్మికులతో ముఖాముఖి మాట్లాడారు.

నల్లబొగ్గు బావుల్లో కార్మికులు పడుతున్న కష్టాలను, ప్రాణసంకట పరిస్థితులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఒక కార్మికుడు తను అనుభవిస్తున్న ఇబ్బందులను వివరిస్తుండగా కవిత తీవ్ర చలనానికి లోనై మైన్ లోపలే కంటతడి పెట్టారు. కార్మికులకు తాము ఎల్లప్పుడూ తోడుగా ఉంటామని, హక్కుల సాధన కోసం పోరాడుతామని భరోసానిచ్చారు. అనంతరం బొగ్గు గని వద్ద నిర్వహించిన భారీ గేట్ మీటింగ్‌లో కవిత మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై, సింగరేణి యాజమాన్యంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఉత్తర తెలంగాణకు ఆర్థిక వెన్నెముకగా నిలిచిన సింగరేణి సంస్థకు ప్రస్తుత ప్రభుత్వమే పెద్ద విద్రోహిగా మారిందని ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి దాదాపు రూ. 50 వేల కోట్ల బకాయిలు పెట్టడం వల్లే సంస్థ తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయిందని ఆరోపించారు.

అధికారులకు ప్రొడక్షన్ టార్గెట్లు పెంచడంపై ఉన్న శ్రద్ధ కార్మికులకు కనీస సౌకర్యాలు, ఆధునిక పనిముట్లు కల్పించడంపై లేదని మండిపడ్డారు. "అండర్‌గ్రౌండ్ మైనింగ్‌లో మెషినరీని అప్‌గ్రేడ్ చేయడం లేదు. మ్యాన్ చైర్ మీద 45 నిమిషాల పాటు ప్రయాణించడం వల్ల కార్మికులు తీవ్రమైన వెన్నునొప్పితో బాధపడుతున్నారు. సింగరేణిలో ఇప్పటికీ బ్రిటిష్ కాలం నాటి దోపిడీ వ్యవస్థ నడుస్తోంది. జేఎంఐటీ లో ఉన్న వారికి తొమ్మిదేళ్లు గడుస్తున్నా ప్రమోషన్లు ఇవ్వకుండా అధికారులు వేధిస్తున్నారు" అని కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను సింగరేణి కార్మికులను కలవకుండా ఉండేందుకు గత నాలుగు రోజులుగా పోలీసులు ఆంక్షలు పెడుతూ అడ్డుకుంటున్నారని కవిత ఆరోపించారు. అసలు సింగరేణి పరిధిలోకి పోలీసులకు అనుమతే లేదని, గేట్ మీటింగ్‌కు వస్తే కార్మికుల జీతాలు కట్ చేస్తామని యాజమాన్యం బెదిరించడం దుర్మార్గమన్నారు. ఒక్క కార్మికుడి జీతం కట్ చేసినా తాను ఇక్కడే గని ముందే ధర్నాకు కూర్చుంటానని హెచ్చరించారు. రాబోయే సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో హెచ్ఎంఎస్ ను భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.

# గజ్వేల్‌లో పాఠశాల బస్సులపై ప్రత్యేక తనిఖీలు

**- ట్రాఫిక్ పోలీస్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ**




**గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )** సిద్దిపేట జిల్లా పోలీస్ కమిషనర్ (సీపీ) ఆదేశాల మేరకు గజ్వేల్ ట్రాఫిక్ పోలీసులు శుక్రవారం పట్టణంలోని పిడిచేడు రోడ్డుపై పాఠశాల బస్సులపై ప్రత్యేక తనిఖీ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని బస్సుల భద్రతా ప్రమాణాలు, వాహన పత్రాలు మరియు సిబ్బంది విధి నిర్వహణపై క్షుణ్ణంగా పరిశీలించారు. తనిఖీల సందర్భంగా బస్సు డ్రైవర్లు పరిశుభ్రమైన యూనిఫాం, నేమ్ బ్యాడ్జ్‌తో విధులు నిర్వహిస్తున్నారా అనే అంశాన్ని పరిశీలించారు. అలాగే వాహనాలకు చెల్లుబాటు అయ్యే ఫిట్‌నెస్ సర్టిఫికేట్, పర్మిట్, ఇన్సూరెన్స్, పొల్యూషన్ అండర్ కంట్రోల్ (పీయూసీ) సర్టిఫికెట్లు ఉన్నాయా లేదా తనిఖీ చేశారు.ప్రతి బస్సులో ఫస్ట్ ఎయిడ్ కిట్, జీపీఎస్ పరికరం, హెల్పర్ అందుబాటులో ఉండాలని, బస్సు సీటింగ్ సామర్థ్యానికి మించి విద్యార్థులను ఎక్కించకూడదని యాజమాన్యాలకు సూచించారు. అదేవిధంగా అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగపడే ఎమర్జెన్సీ ఎగ్జిట్ సక్రమంగా పనిచేస్తుందో లేదో కూడా పరిశీలించారు.ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యాలు, డ్రైవర్లు, సహాయక సిబ్బందికి విద్యార్థుల భద్రతకు సంబంధించిన పలు సూచనలు అందజేశారు. విద్యార్థుల సురక్షిత ప్రయాణం కోసం ప్రభుత్వం నిర్దేశించిన అన్ని భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని గజ్వేల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ సూచించారు, ఈ కార్యక్రమంలో జగదీష్, ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు


# శనివారం రైతుల ఖాతాల్లో రూ.7,000 జమ చేయనున్న కూటమి ప్రభుత్వం : ముఖ్యమంత్రి చంద్రబాబు

**- తొలి విడతగా రూ.183 కోట్లు పెట్టుబడి సాయం విడుదల**

**- రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం**

**- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**

**- ఖరీఫ్‌కు ముందే ఆర్థిక ఊతం**



నిమ్మాడ (ప్రశ్న న్యూస్) అన్నదాతకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకుంది. సాగు పెట్టుబడి కష్టాల నుంచి రైతును గట్టెక్కించేందుకు ప్రవేశపెట్టిన 'అన్నదాత సుఖీభవ' పథకానికి శ్రీకారం చుట్టింది. 2026-27 ఆర్థిక సంవత్సరానికి గానూ ఖరీఫ్ సీజన్ ముందే రైతులకు అండగా నిలిచేందుకు తొలి విడత నిధులను విడుదల చేస్తోంది. శనివారం జరిగే అధికారిక కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బటన్ నొక్కి రైతుల ఖాతాల్లో ఈ నిధులను జమ చేయనున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త సమన్వయంతో శ్రీకాకుళం జిల్లాలో మొత్తం 2,79,100 మంది రైతులకు రూ.183 కోట్ల మేర లబ్ధి చేకూరనుంది.వ్యవసాయాన్ని పండుగ చేయడమే లక్ష్యంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు నేతృత్వంలో ఈ పథకం పక్కాగా రూపుదిద్దుకుంది. గత ప్రభుత్వం 'రైతు భరోసా' పేరిట ఏడాదికి కేవలం రూ.13,500 మాత్రమే అందించి చేతులు దులుపుకోగా, కూటమి ప్రభుత్వం ఆ మొత్తాన్ని రూ.20 వేలకు పెంచుతూ చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా ఈ ఏడాది తొలి విడతగా రూ.7,000 రైతుల ఖాతాల్లో చేరనున్నాయి. కేంద్ర ప్రభుత్వం 'పీఎం కిసాన్' కింద రూ.2,000, రాష్ట్ర ప్రభుత్వం తన వంతుగా రూ.5,000 కలిపి మొత్తం ఏడు వేల రూపాయలను నేడు అన్నదాతల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేయనున్నారు. సంబంధిత వివరాలను జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారురాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చొరవ.. రైతుల్లో హర్షంవ్యవసాయ శాఖ మంత్రిగా అచ్చెన్నాయుడు బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి రైతాంగ శ్రేయస్సే ధ్యేయంగా జిల్లాలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారు. గతంలో పంట విక్రయించిన తర్వాత నెలల తరబడి నిధుల కోసం నిరీక్షించాల్సి వచ్చేది. కానీ, ప్రస్తుత ప్రభుత్వం తీసుకున్న ప్రత్యేక చర్యల వల్ల వరి ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో సొమ్ము జమ అవుతోంది. దీనికి తోడు సాగు ప్రారంభంలోనే పెట్టుబడి సాయం అందుతుండటంతో జిల్లా రైతాంగంలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.కేవలం పెట్టుబడి సాయమే కాకుండా, వ్యవసాయ వ్యయాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం పలు రాయితీలను అమల్లోకి తెచ్చింది. ఎస్సీ, ఎస్టీ రైతులకు ఉచితంగా బిందు, తుంపర్ల సేద్యం యూనిట్లను పంపిణీ చేసేందుకు ఇప్పటికే ఉత్తర్వులు జారీ అయ్యాయి. జిల్లాలోని మెట్ట, మాగాణి భూముల్లో వరి, పత్తి, మిరప, మొక్కజొన్న, పూలు, కూరగాయలు, ఉద్యాన పంటలు సాగు చేసే రైతులు.. ఇప్పటివరకు ప్రైవేటు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి అప్పులపాలయ్యేవారు. ఇప్పుడు ప్రభుత్వం అందిస్తున్న ఈ సాయంతో తమకు ఎంతో ఆర్థిక వెసులుబాటు కలుగుతుందని జిల్లా అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. రైతుల తలసరి ఆదాయాన్ని పెంచడమే ప్రభుత్వం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు.ప్రతి రైతుకు నాణ్యమైన విత్తనాలను సబ్సిడీపై అందిస్తున్నామని, ఆధునిక వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించేందుకు బిందుసేద్యం పరికరాలపై 90 శాతం వరకు సబ్సిడీ కల్పిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు, పథకాలను రైతులు సద్వినియోగం చేసుకుని దిగుబడులు, ఆదాయాన్ని పెంచుకోవాలని మంత్రి సూచించారు.

# పాయకరావుపేట అభివృద్ధే నా లక్ష్యం:హోంమంత్రి వంగలపూడి అనిత

**- ఎంతమంది నన్ను ఎన్ని రకాలుగా అవమానించాలనా, నేను వెనకడుగు వేసేదే లేదు.**

**- నా ధైర్యం నా పాయకరావుపేట ప్రజలు, రాష్ట్ర ప్రజలు,కూటమి నాయకత్వం.**



**నక్కపల్లి(ప్రశ్న న్యూస్)**ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా పాయకరావుపేట నియోజకవర్గంలో శుక్రవారం విజయోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. నక్కపల్లి మండలం దొడ్డిగల్లు జంక్షన్ నుంచి వేంపాడు టోల్ ప్లాజా వరకు కూటమి నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత పాల్గొన్నారు. అనంతరం భారతి కన్వెన్షన్‌లో నిర్వహించిన విజయోత్సవ సభలో హోంమంత్రి పాల్గొని ప్రసంగించారు. వేడుకల సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ అభివృద్ధి, సంక్షేమ స్టాల్స్‌ను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా హోంమంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ, గత రెండేళ్లలో ఎన్డీఏ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తున్నామని తెలిపారు. ప్రజలకు సేవ చేయడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. తాను 2013 వరకు ఒక సాధారణ ఉపాధ్యాయినిగా పనిచేశానని, ఎలాంటి రాజకీయ నేపథ్యం లేకుండానే ప్రజల ఆశీర్వాదంతో రాజకీయాల్లోకి వచ్చానని చెప్పారు. 2014-19 మధ్య ఎమ్మెల్యేగా పాయకరావుపేట నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేశానని, 2019-24 మధ్య ప్రజా సమస్యలపై పోరాటాలు చేశామని తెలిపారు. 2024 ఎన్నికల్లో పాయకరావుపేట ప్రజలు చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 47 వేల మెజారిటీతో గెలిపించారని గుర్తుచేశారు. ప్రజల ఆశీర్వాదం వల్లే మంత్రి పదవి దక్కిందని, ఎక్కడికి వెళ్లినా నియోజకవర్గ అభివృద్ధే తన ఆలోచన అని అన్నారు. అనకాపల్లి జిల్లాకు పెద్ద ఎత్తున పరిశ్రమలు వస్తున్నాయని, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు హోంమంత్రి అనిత ఎన్నో ప్రజా పోరాటాలు చేశారని కొనియాడారు. ఆమె నాయకత్వంలో పాయకరావుపేట నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బద్వేల్‌లో వైభవంగా ప్రారంభమైన కోదండరామస్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం



**బద్వేలు** బద్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని జాంబవంత నగర్ లో శ్రీ కోదండరామస్వామి వారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమం గురువారం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. ప్రముఖ వేద పండితులు బ్రహ్మశ్రీ సత్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో రుత్వికులు, అర్చకులు శాస్త్రోక్తంగా ఈ పూజా కార్యక్రమాలను నిర్వహించారు.?విగ్రహ ప్రతిష్టోత్సవంలో భాగంగా ఉదయం నుంచే ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఉదయం వేళల్లో:గంగా నయనం, గణపతి పూజ, స్వస్తి వాచనం మాతృక పూజ, రక్షాబంధనం, ఆచార్యాది రుత్విగ్రహణంయాగశాల ప్రవేశం, ప్రధాన కలశ స్థాపనసర్వతోభద్ర మండల, ఏకలింగతోభద్ర మండల కలశ స్థాపన అఖండ దీప ప్రతిష్ట, వాస్తు మండలారాధన?ఆదిత్యాది నవగ్రహారాధన, దేవి సప్తశతి పారాయణంయంత్రములకు మహన్యాస పూర్వక రుద్రాభిషేకం తదితర పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారుఅలాగే, సాయంత్రం సమయంలో మృత్యుంగ్రహణం, అంకురార్పణం, ప్రధాన దేవత ఆవాహనం, అగ్ని ప్రతిష్ట, దీక్షా హోమం, మూలమంత్ర అనుష్టానం, జలాధివాసం, యంత్రములకు సహస్రనామార్చన మంగళహారతి వంటి విశేష పూజా కార్యక్రమాలను వైభవంగా పూర్తి చేశారు.ఈ మహోత్సవంలో భాగంగా భక్తులు, కంకణదారులు అమ్మవారి ఆలయం నుండి ప్రత్యేక బ్యాండ్ మేళా తాళాలు, మంగళ వాయిద్యాల నడుమ పుట్టమన్ను సేకరించి, ఊరేగింపుగా కోదండరామస్వామి దేవాలయం వద్దకు తీసుకువచ్చారు. కాలనీవాసులు, భక్తులు పెద్ద సంఖ్యలో కంకణ ధారణ చేసి స్వామివారి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.ఆలయానికి వచ్చే భక్తులకు ఎక్కడా ఎటువంటి ఆటంకాలు కలగకుండా ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు వళ్ళంకొండు వెంకటరమణ, కె.వి. సుబ్బారావు, రామకోటిరాజు, పెద్ది సుధాకర్, పబ్బతి చంద్రశేఖర్, సి.వి. నాగేశ్వరరావు, సునీల్ కుమార్ తదితరులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులకు ప్రత్యేక పూజా దర్శనాలు కల్పించడంతో పాటు, మూడు పూటలా అల్పాహారం, విందు భోజన సౌకర్యాలను అద్భుతంగా ఏర్పాటు చేశారు, స్వామి వారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవానికి విచ్చేసిన భక్తులు అందరికీ స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేయడం జరిగింది, శ్రీ కోదండరామస్వామి విగ్ర ప్రతిష్ట మహోత్సవం కార్యక్రమం బ్రహ్మశ్రీ సత్యనారాయణ శర్మ, లోకేష్ శర్మ,బ్రహ్మ శర్మ, వెంకయ్య స్వామి పలువురు స్వాముల ఆధ్వర్యంలో కనుల పండగగా ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించడం జరిగింది, ఈ కార్యక్రమంలో తోడేటి సుబ్బయ్య యాదవ్ సతీమణి తిరుపతమ్మ, రాచపూడి వెంకటరత్నం విశ్వహిందూ పరిషత్ అధ్యక్షులు పెరుగు వెంకటయ్య బిజెపి పట్టణ అధ్యక్షులు దర్మి శెట్టి వెంకటసుబ్బయ్య, కన్నమర్లపూటి రాజన్న, తులసి వెంకటసుబ్బయ్య వల్లంపండు అనిత్, కాలువ నాగేంద్రబాబు, శివకుమార్, దెయ్యాల వాసు, గంటా శ్రీనివాసులు, తెళ్ళ సునీల్, దియ్యాల కోదండ రామమూర్తి, దియ్యాల రామకృష్ణ, తెళ్ళ విష్ణువర్ధన్ కాలనీవాసులు పాల్గొన్నారు

# కవ్వంపల్లి ఆధ్వర్యంలో ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



**కరీంనగర్** కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్‌సభ లో కాంగ్రెస్ పక్ష నాయకుడు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను శుక్రవారం గాంధీ భవన్‌లో టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో ఎమ్మెల్యే కేక్ కట్ చేసి రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ రాహుల్ గాంధీని ప్రధాన మంత్రిని చేయడమే మనందరి లక్ష్యం కావాలన్నారు. ఈ దిశగా పార్టీ శ్రేణులంతా క్షేత్రస్థాయిలో గట్టి కృషి చేయాలన్నారు. దేశ రాజకీయాల్లో విలువలతో కూడిన నాయకత్వానికి రాహుల్ గాంధీ ప్రతీకగా నిలిచారని ఆయన పేర్కొన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, రాజ్యాంగ విలువల కాపాడటం, సామాజిక న్యాయం సాధన కోసం ఆయన నిరంతరం పోరాటం చేస్తున్నారని కొనియాడారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో దేశానికి దూరదృష్టి కలిగిన, ప్రజల సంక్షేమం పట్ల అంకితభావంతో పనిచేసే నాయకత్వం అవసరమని, ఆ లక్షణాలన్నీ రాహుల్ గాంధీలో మెండుగా ఉన్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. దేశంలోని యువత, రైతులు, కార్మికులు, మహిళలు, వెనుకబడిన వర్గాల సమస్యలను పార్లమెంట్‌తో పాటు ప్రజల మధ్యకు తీసుకెళ్లిన నాయకుడు రాహుల్ గాంధీయేనని అన్నారు. భారత్ జోడో యాత్ర, భారత్ జోడో న్యాయ యాత్రల ద్వారా దేశ ప్రజల్లో ఐక్యత, సోదరభావం, సామాజిక సమానత్వం సందేశాన్ని బలంగా చాటారని తెలిపారు.కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను గ్రామీణ స్థాయి వరకు తీసుకెళ్లి ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రాహుల్ గాంధీ ఆశయాల సాధన కోసం ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి, రాష్ట్ర కోఆర్డినేటర్ ఆరెపల్లి రాజేందర్, ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు గడ్డం శ్రీనివాస్, జగన్, వినోద్ సింగ్,నర్సింహ,ఓం ప్రకాశ్, చంద్రయ్య, చంద్రశేఖర్ తోపాటు పలు జిల్లా అధ్యక్షులు, బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

# నరసరావుపేటలో ఎలివేట్ఐక్యూ సాఫ్ట్‌టెక్ ప్రారంభం

**- ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించిన నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు**



**నరసరావుపేట :** నరసరావుపేట పట్టణంలోని రామిరెడ్డిపేటలో శుక్రవారం ఎలివేట్ఐక్యూ సాఫ్ట్ టెక్ ప్రైవేట్ లిమిటెడ్ నూతన కార్యాలయ ప్రారంభోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు ముఖ్య అతిథిగా పాల్గొని కంపెనీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ మాట్లాడుతూ, ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ రంగంతో పాటు అన్ని రంగాల్లోనూ ఏఐ టెక్నాలజీ వినియోగం వేగంగా పెరుగుతోందని తెలిపారు. ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రతి ఒక్కరూ అందిపుచ్చుకోవాలని, యువత ఇలాంటి కంపెనీల్లో శిక్షణ తీసుకుని సాఫ్ట్ స్కిల్స్‌ను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని రంగాల్లో యువతకు స్కిల్ డెవలప్‌మెంట్‌పై ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తోందని ఆయన పేర్కొన్నారు. సాఫ్ట్‌వేర్, ఏఐ వంటి అత్యాధునిక రంగాల్లో శిక్షణ పొందడం ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని, నరసరావుపేటలో ఏర్పాటైన ఈ సంస్థ స్థానిక యువతకు ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, స్థానిక నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు

# ఘనంగా లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

**శ్రీకాళహస్తి** శ్రీకాళహస్తి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త తలపా దామోదరం రెడ్డి ఆధ్వర్యంలో లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచుకొని, శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం వద్ద వారు ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు జీవించాలని, భవిష్యత్ లో ప్రధాని కావాలని కొబ్బరికాయలు కొట్టి సంబరాలు జరుపుకున్నారు.తలపా దామోదరం రెడ్డి మాట్లాడుతూ రాహుల్ గాంధీ నిరంతరం దేశ ప్రజల భవిష్యత్తు కొరకు అహర్నిశలు శ్రమిస్తూ నిత్య శ్రామికుడిలా ప్రతి సమస్యపై కష్టపడుతున్నటువంటి గొప్ప వ్యక్తి అని, వారి కుటుంబం ప్రజల కోసం ప్రాణాలు త్యాగం చేశారని రాహుల్ గాంధీ ప్రజల మనిషని భవిష్యత్తులో భారత దేశ ప్రధాని అయి దేశాన్ని సుభిక్షంగా పరిపాలించగలరని ప్రజలు వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి మండల అధ్యక్షులు సురేంద్ర రెడ్డి, రేణిగుంట మండలం అధ్యక్షులు రాహుల్ రాయల్, శ్రీకాళహస్తి పట్టణ యువజన అధ్యక్షులు ఆంటోనీ, నాగరాజు, మహేష్, అరుణ్, చరణ్, జోసెఫ్, సారధి తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రానికి సీఎం, డిప్యూటీ సీఎం రెండు కళ్ళు

**- జనసేన పార్టీ మండల అధ్యక్షుడు చిన్నతోటి నాగరాజు**

**- రెండేళ్ల రాష్ట్రం అభివృద్ధి వైపు పరుగులు**

**- పట్టణ అధ్యక్షురాలు ఆకుల భాగ్యలక్ష్మి శ్రీకాళహస్తి నియోజకవర్గం ఎన్ డి ఏ కూటమి విజయోత్సవ విజయవంతం**

**- ఎమ్మెల్యే బొజ్జలతో జనసేన నాయకుల సందడి**

**రేణిగుంట** రాష్ట్రానికి సీఎం నారా చంద్రబాబు నాయుడు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ రెండు కళ్ళని జనసేన పార్టీ మండల అధ్యక్షుడు చిన్నతోటి నాగరాజు ఆనందం వ్యక్తం చేశారు. శుక్రవారం శ్రీకాళహస్తి పట్టణంలోని ఎస్ ఎస్ కన్వెన్షన్ హాల్ నందు శ్రీకాళహస్తి నియోజకవర్గం స్థాయి ఎన్ డి ఏ కూటమి విజయోత్సవ సభను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శ్రీకాళహస్తి నియోజకవర్గం ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి, శ్రీకాళహస్తీశ్వర ఆలయం చైర్మన్ కొట్టే సాయి మరియు రాష్ట్ర బీజేపీ ఉప అధ్యక్షులు కోలా ఆనంద్ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలో సాధించిన విజయాల గురించి సమావేశంలో చర్చించుకున్నారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ రేణిగుంట మండలాధ్యక్షుడు చిన్నతోటి నాగరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా పరుగులు తీస్తుందని అన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలతో ప్రజలు సుభిక్షంగా ఉన్నారని స్పష్టం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాష్ట్రానికి రెండు కళ్ళు లాంటి వారని పేర్కొన్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో కూటమి నాయకులు ఐక్యమత్యంతో మరిన్ని విజయాలు సాధిస్తామని ధీమా వ్యక్తం చేస్తారు. రాష్ట్రంలో 2 ఏళ్ల పాలన పై నమ్మకం అభివృద్ధి సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగించారని తెలిపారు. పేద ప్రజల ప్రభుత్వమని నిరంతరం వారి అభివృద్ధి కోసమే కూటమి ప్రభుత్వం పాటుపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమం లో రేణిగుంట పట్టణ అధ్యక్షురాలు ఆకుల భాగ్యలక్ష్మి, సీనియర్ నాయకులు త్యాగరాజు, నాయకులు మునికృష్ణ, సలీం, జనసైనికులు మరియు వీర మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో పశు వైద్య శిబిరాలు ఏర్పాటు చేయండి

**- కలెక్టర్ చిత్రా మిశ్రా**

**కరీంనగర్**ం గ్రామాల్లో విరివిగా పశు వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ చిత్రా మిశ్రా పశు వైద్యాధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్ సమీపంలో ఉన్న జిల్లా ప్రధాన పశువుల ఆసుపత్రిని కలెక్టర్ సందర్శించారు.రికార్డులు పరిశీలించారు. ఆస్పత్రి ద్వారా పశువులకు అందిస్తున్న సేవలు, వాక్సినేషన్, మందుల వివరాలు తెలుసుకున్నారు. గదులు కలియ తిరుగుతూ ల్యాబరేటరీ, శస్త్ర చికిత్స గదులు,ఎక్స్ రే గది, మందుల గది పరిశీలించారు. సిబ్బందిని అడిగి పలు వివరాలు తెలుసుకున్నారు. శిథిల భవనం తొలగించండి:ఆస్పత్రి ముందు శిథిలావస్థకు చేరిన పాత భవనాన్ని పరిశీలించి..తొలగించాలని ఆర్ అండ్ బీ అధికారులను ఆదేశించారు. పాత భవనం స్థానంలో ఫౌంటెయిన్, పార్కింగ్ ప్లేస్, జంతువుల శవపరీక్ష ఏర్పాటు చేయాలన్నారు.పక్కనున్న మరో భవనాన్ని జంతువుల ఆపరేషన్ కోసం వినియోగించాలని సూచించారు.ఇక్కడున్న అన్ని పరికరాలను సద్వినియోగం చేసుకుంటూ పశువులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి లింగారెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్లు నరేష్ కుమార్, వినోద్ కుమార్ పాల్గొన్నారు.

# సాయికృష్ణ కుటుంబాన్ని పరామర్శించిన వంగవీటి ఆశ కిరణ్

కృష్ణలంకలోని సాయికృష్ణ నివాసానికి వెళ్లిన వంగవీటి ఆశ కిరణ్ , రాధా రంగా మిత్ర మండలి సభ్యులు కుటుంబ సభ్యులను పరామర్శించారు. సాయికృష్ణ అదృశ్యమైన ఘటనకు సంబంధించిన వివరాలను, ఈ విషయంలో పోలీసులు వ్యవహరించిన తీరును కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా వంగవీటి ఆశ కిరణ్ గారు మాట్లాడుతూ, ఈ క్లిష్ట సమయంలో రాధా రంగా మిత్ర మండలి కుటుంబానికి అండగా నిలుస్తుందని, ఘటనపై పూర్తి స్థాయిలో నిజాలు వెలుగులోకి వచ్చి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని భరోసా ఇచ్చారు.కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ, బాధిత కుటుంబానికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని రాధా రంగా మిత్ర మండలి సభ్యులు తెలిపారు.

# కస్టోడియల్ మరణాలపై మధ్యప్రదేశ్ హైకోర్టు సంచలన తీర్పు



**భోపాల్** పోలీసుల అదుపులో జరుగుతున్న మరణాలపై మధ్యప్రదేశ్ హైకోర్టు సంచలన తీర్పు నిచ్చింది. కస్టడీలో కొట్టి చంపడం పోలీసుల అధికారక విధి కాదని స్పష్టం చేసింది. నిందితులైన పోలీసులను శిక్షించడానికి ప్రభుత్వం నుంచి ముందస్తు అనుమతి అవసరం లేదు. సభ్య సమాజంలో కస్టడీ మరణం ఘోరమైన నేరమని వ్యాఖ్యానించింది.

ఒక కస్టోడియల్ మృతి కేసులో పోలీసుల పిటిషన్ ను కొట్టివేస్తూ జస్టిస్ గజేంద్రసింగ్ తీర్పు వెలువరుస్తూ, థర్డ్ డిగ్రీ ప్రయోగించడం, రికార్డులు ఫోర్జరీ చేయడం పోలీసుల విధి నిర్వహణ కిందకు రావని పేర్కొన్నారు.

# సింగరేణి పైన బీజేపీ చిల్లర రాజకీయాలు మానుకోవాలి

**- సింగరేణిపైన మాట్లాడే నైతిక అర్హత బీజేపీకి లేదు**

**- ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్**

**హైదరాబాద్** సింగరేణిలో పర్యటించే హక్కు బీజేపీ కి లేదు. సింగరేణి పైన బీజేపీ చిల్లర రాజకీయాలు మానుకోవాలని ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ మండిపడ్డారు. బొగ్గు బ్లాక్ లను ప్రైవేటు పరం చేయాలని నిర్ణయించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి నాయకత్వంలో పనిచేస్తున్న బీజేపీ సింగరేణికి వెళ్తోంది. బీజేపీ ఎంత దౌర్భాగ్య స్థితిలో ఉందో దీని వల్ల అర్థమౌతోంది. సింగరేణి పైన బీజేపీ, బీఆర్ఎస్ కలిసి కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు.రాజకీయ రహస్య మిత్రులు ఇద్దరు. సింగరేణి చుట్టు రాజకీయాలు చేస్తున్నారు. బొగ్గు గనులను ప్రైవేటీకరణ చేస్తున్న విధానంపైన బీజేపీ సమాధానం చెప్పాలి. సింగరేణి ని ప్రైవేటీకరణ కు బీజేపీ ప్రభుత్వ ప్రయత్నాలపైన కిషన్ రెడ్డి సమాధానం చెప్పాలి. బొగ్గు గనుల ను ప్రైవేటీకరణ చేస్తున్న బీజేపీకి బొగ్గుల నిల్వలపైన మాట్లాడే అర్హత ఉంది. సింగరేణి ప్రైవేటికరణను అడ్డుకున్నది కాంగ్రెస్ పార్టీ. సింగరేణిని ఆదుకుంటున్నది కాంగ్రెస్ పార్టీ. బోనస్ ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ. సింగరేణి భక్షకులను కార్మికులు నమ్మరు. మీలాంటి వాళ్లను కార్మికులు నమ్ముతారనుకోవడం పిచ్చి భ్రమ.. అందుకే చిల్లర రాజకీయాలు మానండని అన్నారు.

# సాయి కృష్ణ కేసులో చంద్రబాబును ఏ1 గా హోంమంత్రి పై ఏ2 గా కేసు పెట్టాలి

**- మాజీ మంత్రి గుడివాడ**



**విశాఖపట్నం** సాయి కృష్ణ కేసులో చంద్రబాబు ను ఏ1 గా హోంమంత్రి పై ఏ2 గా కేసు పెట్టాలని మాజీ మంత్రి గుడివాడ అమర్ నాథ్ డిమాండ్ చేసారు.రాష్ట్రములో జరుగుతున్న అరాచకాలు చూస్తుంటే భయం వేస్తోంది. నిన్నటి ఘటన చూసుకుంటే రాష్ట్రానికి భవిష్యత్ ఉండే అవకాశం లేదు. గాదె సాయి కృష్ణ అనే 23 ఏళ్ల యువకుడిని కృష్ణ లంక పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. అతని తల్లిని పలుమార్లు స్టేషన్ చుట్టూ తిప్పించారు. ఆ తల్లి నా బిడ్డ ఎక్కడ అనే అడిగితే సరైన సమాధానం ఇవ్వలేదు. సాయి కృష్ణ తల్లి కోర్టులో పిర్యాదు చేసిన తర్వాత తెలిసింది యువకుడిని హత్య చేసి కాల్చి బూడిద చేశారు అని. 79 ఏళ్ల చరిత్రలో ఇలాంటి ఘటన ఏ ప్రభుత్వంలో చూసి ఉండరు. ఇటువంటి చేతకాని ప్రభుత్వాన్ని రాష్ట్ర ప్రజలు అవకాసం ఇచ్చినందుకు సిగ్గుపడుతున్నాం. ముఖ్యమంత్రి కొడుకు అంబెడ్కర్ రాజ్యాంగం పక్కన పెట్టి రెడ్ బుక్ రాజ్యాంగం నడుపుతున్నారు. నిన్నటి వరకు కల్లబొల్లి మాటలు చెప్పిన ముఖ్యమంత్రి ఉపముఖ్యమంత్రి ఈరోజు హడావిడిగా కేసు నమోదు చేశారు. ఒక వ్యక్తిపై కోర్టు వారెంట్ ఉంటే మీరు ఎలా చిత్ర హింసలు పెడతారు.ఆ తల్లి శోకం చూస్తుంటే రాష్ట్ర ప్రజల హృదయాలు తరుక్కుపోతున్నాయని అన్నారు.చేతకాని ప్రభుత్వం చేతకాని పోలీసులు వల్ల ముక్కున వెళ్లేసుకోవాల్సి వస్తుంది. ఎవరిపైన అయితే వారిపైనే గత రెండు సంవత్సరాలుగా కేసులు పెడుతున్నారు. పోలీస్ వ్యవస్థ కాస్త సినిమా పోలీస్ వ్యవస్థ లా తయారైంది. డీజీపీ,హోంమంత్రి, లోకేష్ ,ముఖ్యమంత్రి పైన కేసులు పెట్టాలి. ఒక ఐజి స్థాయి అధికారిని తీసుకు వస్తే ఏమి వివారాలు వస్తాయి. గతంలో బీహార్ లో ఉన్న పరిస్థితులు ఇప్పుడు ఏపీలో చూస్తున్నాం. కేసులు ఉంటే చంపే అధికారం ఎవరీచ్చారు.

70 వేల సీసీ కెమెరాలో రాష్టంలో ఏర్పాటు చేశామని చెప్పారు. మే 9 నుండి ఇప్పటి వరకు జరిగిన దానిపై కృష్ణ లంకలో ఉన్న సీసీ ఫాయిటగెలను బయ్యటకు తీయండి. నాలుగేళ్ళ చిన్నారి తప్పి పోతే పోలీస్ డిపార్ట్మెంట్ ఏమి చేస్తుందో తెలీదు. పక్కా నియోజకవర్గ వర్గంలో జరిగితే హోంమంత్రి వెళ్లి పరామర్శించడానికి 12 రోజులు పట్టింది. లాకప్ డెత్ జరిగితే దానిని మేకప్ చేసే ప్రయత్నం జరిగింది. ఇంకా మీరు దేనిని మేకప్ చేసే పరిస్థితులు లేవు త్వరలోనే ప్రజలు మీకు ఫ్యాకప్ చేసే రోజులు వస్తాయని అన్నారు.సాయి కృష్ణ విషయంలో ఒక సీఐని బలిపశువును చేశారు. దాని వెనుక ఉన్న ఇతర అధికారులు హోంమంత్రి పైన కేసు నమోదు చేయాలి. రాష్ట్రంలో పోలీస్ స్టేషన్ కి వెళితే ఎక్కడ సేవమై బయటకు వస్తామో అని భయం. సాయి కృష్ణ హత్య కేసులో పోలీసులు దర్యాప్తు కాదు సీబీఐ దర్యాప్తుకు డిమాండ్ చేస్తున్నాం. వంగా వీటి మోహన రంగ హత్యకు డిసెంబర్ 26 ముందు రోజు రాత్రి అప్పటి పోలీస్ అధికారి వ్యాస్ చెప్పిన మాటలు. అప్పటి హోంమంత్రి కోడెల శివప్రసాద్ ఎన్టీఆర్ పెద్దల్లుడు ముందురోజు సమావేశం అయ్యారు అని ఒక మాజీ పోలీస్ అధికారే చెప్పారు. మహానాయకుడైన వంగవీటి మోహన్ రంగ గారిని హత్య చేసిన టిడిపి పార్టీ సాయి కృష్ణను హత్య చేయదా . సాయి కృష్ణ కుటుంబానికి వైస్సార్సీపీ అండగా ఉంటుందని అన్నారు.

# శ్రీకాకుళం జిల్లాలో మరో దారుణం

ఓ మహిళ తన ఇద్దరు పిల్లలతో కలిసి రైలు కిందపడి బలవన్మరణానికి పాల్పడింది. ఏం కష్టమొచ్చిందో ఏమో.. ఇవాళ తెల్లవారుజామున పలాస-తాళభద్ర మధ్య రైలు పట్టాలపై ముగ్గురి మృతదేహాలను స్థానికులు గుర్తించి రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలికి చేరుకున్న రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# రాజేంద్రనగర్లో కారులో అగ్ని ప్రమాదం

**రంగారెడ్డి**ఉబుద్వేల్ పిడిపి చౌరస్తా వద్ద కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఫ్లైఓవర్ కింద రద్దీ ప్రాంతంలో ఘటనతో వాహనదారులు భయాందోళనకు గురయ్యారు. ఇంజిన్ భాగంలో ప్రారంభమైన మంటలులలో కారు పూర్తిగా దగ్ధమైయింది. దట్టమైన పొగలతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్ను క్లియర్ చేసారు. కారులో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఇంజిన్ ఓవర్హీట్ లేదా షార్ట్ సర్క్యూట్ కారణమై ఉండొచ్చని అనుమానం.

## ఏఐఎస్ఎఫ్ రాష్ట్రస్థాయి శిక్షణ తరగతుల

# కరపత్రాలు విడుదల



**గురజాల** జులై 1 నుంచి 4వ తేదీ వరకు కర్నూలు నగరంలో జరగనున్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్రస్థాయి విద్యా, వైజ్ఞానిక, రాజకీయ, శిక్షణా తరగతులు జయప్రదం చేయాలని కోరుతూ పల్నాడు జిల్లా గురజాల పట్టణంలోని భారత కమ్యూనిస్టు పార్టీ కార్యాలయం నందు శుక్రవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కరపత్రాలు విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్ జీ మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా అధికారంలోకి రాకముందు విద్యార్థులకు ఇచ్చేటువంటి హామీలు అమలు చేయకుండా రాష్ట్రమంతా ఏదో పెద్ద చేశామన్న ఆనందంలో సంబరాలు చేసుకుంటున్నారు అని అన్నారు మాకు కావాల్సింది సంబరాలు కాదు విద్యార్థులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ని డిమాండ్ చేశారు. ప్రతిపక్షంలో ఉన్న సందర్భంలో మన ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే వంద రోజుల్లో పీజీ విద్యార్థులకు శాపంగా మారిన జీవో నెంబర్ 77 రద్దు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చే నేటికి రెండు సంవత్సరాలు పూర్తి కావస్తున్న ఇంతవరకు జీవో నెంబర్ 77 రద్దు చేయలేదని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేష్ పైన మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు శిథిలా వ్యవస్థలోకి చేరాయి అన్నారు విద్యార్థులు చదువుకుంటున్న సందర్భంలో పైన గోడలకు ఉన్నటువంటి పెచ్చులు ఊడి విద్యార్థుల తలలు పగిలేతట్టువంటి పరిస్థితి ఈ రాష్ట్రంలో చాలా పాఠశాలల్లో కనబడతా ఉంది వాటి మరమ్మతుల కోసం నిధులు విడుదల చేసి ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయకుండా కార్పొరేట్ ప్రైవేట్ విద్యాసంస్థలను ప్రోత్సహిస్తుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఫీజు నియంత్ర చట్టాన్ని పట్టణ ప్రాంతాలలో గ్రామీణ ప్రాంతాలలో ఎంత వసూలు చేయాలని ఒక చట్టాన్ని తీసుకువచ్చినప్పటికీ ఈ రాష్ట్రంలో ఏ ఒక్క ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యులు దాన్ని పాటించకపోవడం లేదని మండిపడ్డారు. వైద్య విద్యను ప్రైవేటీకరణ ఆపాలని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎంతోమంది పేద, మధ్య తరగతి తల్లితండ్రులు తమ కూతుర్లు, కొడుకులు మంచి కోచింగ్ పంపిస్తే నీట్లో ర్యాంకు వస్తే డాక్టర్లు అవుతారన్న ఆనందం ఉంటే, దేశవ్యాప్తంగా మొన్న జరిగినటువంటి నీటి ప్రవేశ పరీక్ష లీకైతే మన రాష్ట్రంలో ఉన్న విద్యాశాఖ మంత్రి ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం సరైనది కాదని మండిపడ్డారు. అంటే ఈ రాష్ట్రంలో ఉన్నటువంటి విద్యార్థుల బాధలు కష్టాలు మీకు అవసరం లేదా అని నారా లోకేష్ ను ప్రశ్నించారు. రాష్ట్రవ్యాప్తంగా హైస్కూల్ ప్లస్ ఇంటర్ విద్యార్థికి సంబంధించి గర్ల్స్ కి 20094 పాఠశాలలకు గాను 250 పాఠశాలలోనే కొనసాగుతూ, అబ్బాయిలకు సంబంధించి 210 పాఠశాలలకు గాను 114 పాఠశాలలు మాత్రమే కొనసాగుతూ ఇంటర్ పాస్ పర్సంటేజ్ 55 శాతానికి మించినటువంటి దయనీయ సమస్యలల్లో ఇంటర్ ప్లస్ పాఠశాల విద్యా విధానం కొనసాగుతున్న అర్హత, అనుభవం లేని అధ్యాపకుల ద్వారా విద్యా బోధన చేయడం వల్ల ఇలాంటి పరిస్థితులు ఉన్నా కూడా కూటమి ప్రభుత్వం ప్రభుత్వ విద్య పైన దృష్టి పెట్టకుండా చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. పైగా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రభుత్వ విద్యను పరిరక్షిస్తున్నాము ముందుకు తీసుకెళుతున్నామని ప్రకటనలకే పరిమితమయ్యారు అని అన్నారు. జులై 1 నుంచి 4వ తేదీ వరకు జరిగే ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర శిక్షణ తరగతులలో రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్నటువంటి విద్యా వ్యతిరేక విధానాల పైన చర్చించి రాష్ట్రవ్యాప్తంగా సమరసిర పోరాటాలకు శ్రీకారం చూస్తామని ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమం ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మధు, పి.దుర్గా ప్రసాద్, ఎస్ కె .అర్షద్, ఎం.అనిల్, ఎస్. ప్రశాంత్, డి. హుస్సేన్, కె.ప్రభు తదితరులు పాల్గొన్నారు

## కూటమి ప్రభుత్వ రెండేళ్ల

# విజయోత్సవ జిల్లా స్థాయి సభ

**- పాల్గొన్న కడప డిసిసి బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి.**



**బద్వేలు** కూటమి ప్రభుత్వం విజయవంతంగా రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా కడపలో నిర్వహించిన జిల్లా స్థాయి విజయోత్సవ సభలో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి, జిల్లా ఇన్ఛార్జి మంత్రి సవితమ్మ , జిల్లా ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులతో కలిసి కడప డిసిసి బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో కూటమి ప్రభుత్వం గత రెండేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందించిన సేవలు, వివిధ రంగాలలో సాధించిన పురోగతిపై విస్తృతంగా చర్చించారు. రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, సామాజికంగా వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం ప్రభుత్వం చేపట్టిన పలు సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువయ్యాయని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి, పారదర్శక పాలన, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని కడప డిసిసి బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి అన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రతి వర్గానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం కృషి చేస్తోందని, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటోందని తెలిపారు. అలాగే, జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, భవిష్యత్తులో చేపట్టబోయే కార్యక్రమాలపై కూడా సమావేశంలో చర్చించారు. రాష్ట్ర ప్రజల సహకారంతో మరింత సమర్థవంతమైన పాలన అందించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు, కూటమి శ్రేణులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఓయూలో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

**హైదరాబాద్** ఉస్మానియా యూనివర్సిటీలోని ఆర్ట్స్ కళాశాల వద్ద కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకుడు పార్లమెంట్ సభ్యుడు రాహుల్ గాంధీ పుట్టినరోజు వేడుకలను ఎన్ఎస్యుఐ జాతీయ నాయకులు కోట దుర్గ రాజ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి రాహుల్ గాంధీకి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కోట దుర్గ రాజ్ మాట్లాడుతూ రాహుల్ గాంధీ రానున్న రోజుల్లో ప్రధానమంత్రి అవడం ఖాయం అన్నారు. రాహుల్ గాంధీని ప్రధాని చేయడానికి ప్రతి ఒక్క కాంగ్రెస్ కార్యకర్త, ఎన్ఎస్యుఐ నాయకుడు కృషి చేయాలని పిలుపునిచ్చారు. భారతదేశం అభివృద్ధి చెందాలంటే అది కేవలం రాహుల్ గాంధీ వల్లనే సాధ్యమవుతుందన్నారు...

## తుర్కయంజాల్లో రెవెన్యూ అధికారులపై

# మహిళ దౌర్జన్యం.. తీవ్ర కలకలం

**ఇబ్రహీంపట్నం** ఆర్డీవో ఆదేశాల మేరకు వివాదాస్పద భూమిని స్వాధీనం చేసుకోవడానికి వెళ్లిన అబ్దుల్లాపూర్మెట్ ఆర్ఐ, జీపీవోలపై మహిళ దాడి కి దిగింది. ఆర్ఐ ప్రేమ్ కుమార్ గల్లా పట్టుకుని బండబూతులు తిడుతూ లాక్కెళ్ళింది. "మీరు అధికారులని గ్యారంటీ ఏంటి?" అంటూ ఆర్ఐ గుర్తింపు కార్డును లాక్కుని దుర్భాషలాడిన వైనం. అబ్దుల్లాపూర్ మెట్ మండలం తుర్కయంజాల్ లోని సర్వే నంబర్ 338లో ఉన్న 1810 గజాల భూమిపై వివాదం వుంది. వివాదాస్పద భూమిని ప్రభుత్వాధీనంలోకి తీసుకోవాలని ఆర్డీవో ఉత్తర్వులు జారీ చేయడంతో రెవెన్యూ సిబ్బంది వెళ్లారు. ఎంత నచ్చజెప్పినా వినకుండా: తాము ఉన్నతాధికారుల ఆదేశాలతోనే వచ్చామని మొత్తుకున్నా వినకుండా మహిళ రెచ్చిపోయింది. పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు విధులకు ఆటంకం కలిగించి, దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆర్ఐ ప్రేమ్ కుమార్ ఫిర్యాదు చేసారు. తనను కులం పేరుతో దూషించారంటూ ఆదిబట్ల పోలీసులకు జీపీవో హన్మంతు ఫిర్యాదు చేసారు. రెవెన్యూ అధికారుల ఫిర్యాదుతో ఆదిబట్ల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. .

# ఓయూలో విద్యార్థుల నిరసన

**హైదరాబాద్** కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిరుద్యోగులను దృష్టిలో పెట్టుకొని రెండు లక్షల ఉద్యోగాల నోటిఫికేషన్ విడుదల చేసి జాబ్ క్యాలెండర్ ప్రకటించి యువత భవిష్యత్తును కాపాడాలని విద్యార్థి సేన రాష్ట్ర అధ్యక్షులు టి కే శివకుమార్ డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీ పుట్టిన రోజు సందర్భంగా నిరుద్యోగ హామీలను గుర్తుచేస్తూ ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల వద్ద నిరుద్యోగులతో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువత తరఫున పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూనే... ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు ఇచ్చిన హామీల వివరాలతో కూడిన హార్డ్ డిస్క్ ను రాహుల్ గాంధీకి బహుమతిగా పంపిస్తున్నట్లు తెలిపారు. బహుమతి అందిన తర్వాతనైనా హామీలను గుర్తు చేసుకుని తెలంగాణ నిరుద్యోగ యువతకు న్యాయం చేయాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిరుద్యోగ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు...

# బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో ఓయూ విద్యార్థి సదస్సు

**- గోడ పత్రిక ఆవిష్కరణ**

**హైదరాబాద్** విద్యారంగ సమస్యల పరిష్కారానికై ఈ నెల 22వ తేదీన ఉస్మానియా యూనివర్సిటీలోని ఠాగూర్ ఆడిటోరియంలో బీఆర్ఎస్వి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొంపల్లి నరేష్ ఆధ్వర్యంలో ఓయూ విద్యార్థి సదస్సును నిర్వహించనున్నారు. సదస్సుకు సంబంధించిన గోడపత్రిక ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఆర్ట్స్ కళాశాల వద్ద నిర్వహించారు. బీఆర్ఎస్వి రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగ బాలు ముఖ్యఅతిథిగా హాజరై గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాలు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 30 నెలలు గడుస్తున్న విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో తీవ్రంగా విఫలమైందని మండిపడ్డారు. ముఖ్యంగా 10 సంవత్సరాలలో పెండింగ్ లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్లను విడుదల చేయకపోవడం దారుణం అన్నారు. పెండింగ్ బకాయిలను విడుదల చేయకపోవడం వల్ల విద్యార్థులు తీవ్రంగా ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికై ఈనెల 22వ తేదీన ఉస్మానియా యూనివర్సిటీలో ఠాగూర్ ఆడిటోరియంలో బీఆర్ఎస్వి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొంపల్లి నరేష్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఓయూ విద్యార్థి సదస్సును విద్యార్థులు, విద్యార్థి నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు...

## " సీఎం ప్రజావాణి "లో ప్రజల సమస్యల

# పరిష్కారం బాగుంది

**- ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి కితాబు**

**హైదరాబాద్** బేగంపేట్ లోని మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్ లో జరుగుతున్న " సీఎం ప్రజావాణి, ప్రవాసి ప్రజావాణి " ని భువనగిరి ఎం.పీ. చామల కిరణ్ కుమార్ రెడ్డి శుక్రవారం సందర్శించారు. సీఎం ప్రజావాణి, ప్రవాసి ప్రజావాణిలోని ప్రతి టేబుల్ వద్దకు వెళ్లి డెస్క్ అధికారులతో కిరణ్ కుమార్ రెడ్డి ఇంటరాక్ట్ అయ్యారు. ప్రజావాణి అమలు జరుగుతున్న తీరును, ప్రజలు అందిస్తున్న అర్జీల పరిష్కారం తీరును చామల కిరణ్ కుమార్ రెడ్డి అధికారులను అడిగి తెలుసుకున్నారు. సీఎం ప్రజావాణిలో ప్రజల సమస్యలు 74 శాతం పరిష్కారం కావడం పట్ల చామల కిరణ్ కుమార్ రెడ్డి సంతృప్తి వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో మరింత పక్కాగా ప్రజల సమస్యలు పరిష్కారం అయ్యేందుకు చర్యలు తీసుకోవాలని చామల కిరణ్ కుమార్ రెడ్డి ప్రజావాణి అధికారులకు సూచించారు. సీఎం ప్రజావాణి ఇంచార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి, వివిధ శాఖల అధికారులు ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డికి సీఎం ప్రజావాణి అమలు తీరును వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ ఆర్ ఐ సలహా మండలి వైస్ చైర్మన్ మంద భీం రెడ్డి, సభ్యులు నంగి దేవేందర్ రెడ్డి, పద్మా రాణి కర్రి, తదితరులు పాల్గొన్నారు.

# రాయదుర్గంలో టెస్లా షోరూమ్ ప్రారంభం

**- హైదరాబాద్ ఐటీ కారిడార్లో టెస్లా ఎక్స్పీరియన్స్ సెంటర్కు శ్రీకారం.**

:ప్రపంచ ప్రఖ్యాత ఎలక్ట్రిక్ వాహనాల తయారీ సంస్థ ౧వబశ్రీజీ హైదరాబాద్లో తన తొలి ఎక్స్పీరియన్స్ సెంటర్ను ప్రారంభించింది. రాయదుర్గం సమీపంలోని హైటెక్ సిటీలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రం తెలంగాణలో టెస్లా తొలి షోరూమ్గా నిలిచింది.ఎలక్ట్రిక్ వాహనాల రంగంలో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన టెస్లా సంస్థ రాయదుర్గం పరిసర ప్రాంతంలో తన తొలి ఎక్స్పీరియన్స్ సెంటర్ను అందుబాటులోకి తీసుకొచ్చింది. సత్వ నాలెడ్జ్ సిటీలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రంలో టెస్లా మోడల్ వై, మోడల్ వై ఎల్ వాహనాలను ప్రదర్శనకు ఉంచారు.వాహనాల పనితీరు, అత్యాధునిక సాంకేతికత, భద్రతా ఫీచర్లు, ఛార్జింగ్ సదుపాయాలపై వినియోగదారులకు ప్రత్యక్షంగా అవగాహన కల్పించనున్నారు. భారత మార్కెట్లో విస్తరణలో భాగంగా టెస్లా హైదరాబాద్లో అడుగుపెట్టడం నగరంలోని ఎలక్ట్రిక్ వాహనాల రంగానికి కొత్త ఊపు తీసుకురానుంది.ఐటీ ఉద్యోగులు, యువత, ఎలక్ట్రిక్ వాహనాలపై ఆసక్తి ఉన్న వినియోగదారులను ఆకర్షించేలా ఈ ఎక్స్పీరియన్స్ సెంటర్ను రూపొందించినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు.

# మండలంలో రైతులకు యూరియా పంపిణీ

**నందవరం** మండలంలోని రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకూడదనే ఉద్దేశంతో, స్థానిక ఎమ్మెల్యే జయ నాగేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని రైతాంగానికి యూరియాను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమాన్ని మండలంలోని తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు అప్పా రాజశేఖర్ , మాజీ జిల్లా ఉపాధ్యక్షులు మాధవస్వామి, ధర్మపురం గోపాల్ మరియు కార్యకర్తలు పర్యవేక్షించారు.వ్యవసాయ పనులకు కీలకమైన సమయంలో యూరియా అందుబాటులో ఉండటం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేశారు.సాగులో యూరియా కొరత లేకుండా చూడాలని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి రైతుకు సకాలంలో ఎరువులు అందేలా చూడాలని ఎమ్మెల్యే స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.టిడిపి నాయకులు ఎటువంటి అక్రమాలకు తావు లేకుండా,అర్హులైన రైతులందరికీ పారదర్శకంగా యూరియాను అందజేయడంపై దృష్టి సారించారు.నిత్యావసర సమయంలో తమకు అండగా నిలిచిన ఎమ్మెల్యేకు, మరియు పంపిణీలో సహకరించిన టిడిపి నాయకులకు స్థానిక రైతులు ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు మరియు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## బీజేపీ మండల అధ్యక్షునిగా వినుకొల్లు చక్రవర్తి



ఏటూరునాగారం ప్రజా (ప్రశ్నన్యూస్) భారతీయ జనతా పార్టీ ఏటూరునాగారం మండల అధ్యక్షునిగా వినుకొల్లు చక్రవర్తి రెండవసారి నియమితులయ్యారు. ములుగు జిల్లా బీజేపీ అధ్యక్షులు శ్రీ సిరికొండ బలరాం గారు ఈ మేరకు నియామక ఉత్తర్వులు జారీ చేశారు. నూతన మండల అధ్యక్షులు వినుకొల్లు చక్రవర్తి మాట్లాడుతూ, తనపై పూర్తి విశ్వాసం ఉంచి రెండవసారి మండల అధ్యక్ష బాధ్యతలు అప్పగించినందుకు జిల్లా అధ్యక్షులు సిరికొండ బలరాం గారికి, రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా తన నియామకానికి సహకరించిన ఏటూరునాగారం మండల బీజేపీ సీనియర్ నాయకులకు, వివిధ మోర్చాల నాయకులకు, బూత్ స్థాయి కార్యకర్తలకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

### ప్రజా సమస్యలే ప్రథమ ప్రాధాన్యం..

గత పదవీకాలంలో మండలంలో పార్టీని బూత్ స్థాయి నుండి బలోపేతం చేయడానికి కృషి చేశాను. ఈ రెండవసారి అవకాశాన్ని కూడా ప్రజాసేవకే వినియోగిస్తాను. ఏటూరునాగారం మండలంలోని ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీరు, రోడ్లు, వైద్యం, వ్యవసాయ సమస్యలపై ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాను" అని చక్రవర్తి స్పష్టం చేశారు.

### పార్టీ బలోపేతమే లక్ష్యం..

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్లే బాధ్యత తీసుకుంటానని ఆయన తెలిపారు. రానున్న రోజుల్లో పార్టీ కార్యక్రమాలను మండలంలోని అన్ని గ్రామాల్లో విస్తృతంగా నిర్వహిస్తామని, సీనియర్ నాయకులు, యువకులు, మహిళా మోర్చా, కిసాన్ మోర్చా నాయకులందరితో సమన్వయం చేసుకుంటూ పార్టీని మరింత బలోపేతం చేస్తానని హామీ ఇచ్చారు. పార్టీ ఇచ్చిన ఈ బాధ్యతను నిజాయితీగా, అంకితభావంతో నిర్వర్తిస్తానని, అందరి సహకారం కోరుతున్నానని వినుకొల్లు చక్రవర్తి పేర్కొన్నారు.

## ప్రజా ఉద్యమాల బలోపేతమే సీపీఐ లక్ష్యం

**- ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటాలే మార్గం**

**- పశ్య పద్మ సి పి ఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు**



గజ్వేల్ ( ప్రజా ప్రశ్న ) ప్రజా ఉద్యమాలను బలోపేతం చేయడం, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటాలు నిర్వహించడమే భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) లక్ష్యమని ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ అన్నారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో సీపీఐ ఆధ్వర్యంలో సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాల కౌన్సిల్ సభ్యుల రాజకీయ శిక్షణ శిబిరాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. కార్యక్రమం ప్రారంభంలో సీపీఐ ఉమ్మడి మెదక్ జిల్లా మాజీ కార్యదర్శి బట్టు దయానంద్ రెడ్డి పార్టీ జెండాను ఆవిష్కరించగా, సీనియర్ నాయకుడు వీర్ల ప్రకాష్ రాజకీయ శిక్షణ తరగతులను ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన పశ్య పద్మ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతోందని విమర్శించారు. పెరుగుతున్న నిత్యావసర ధరలు, ఆర్థిక అసమానతలు ప్రజలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని అన్నారు. కార్మికులు, రైతులు, యువత, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి బలమైన విప్లవ పార్టీ అవసరమని పేర్కొన్నారు. రాజకీయ శిక్షణ శిబిరాలు పార్టీ బలోపేతానికి, కార్యకర్తల్లో సిద్ధాంతపరమైన అవగాహన పెంపొందించడానికి, ప్రజా ఉద్యమాలను మరింత విస్తృతంగా నిర్మించడానికి దోహదపడతాయని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## మేడ్చల్‌లో డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ మౌనిక ఆకస్మిక తనిఖీలు

**కిరాణా షాపులు, ఫ్యాన్సీ స్టోర్లు, బ్యూటీ పార్లర్లలో విస్తృత పరిశీలన**

**నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలని హెచ్చరిక**

**ఇన్‌స్పెక్టర్ మౌనిక చొరవపై స్థానికుల ప్రశంసలు**

**ప్రజారోగ్యంతో ఆటలాడితే చట్టపరమైన చర్యలు తప్పవు: డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ మౌనిక**



మేడ్చల్ (ప్రశ్న న్యూస్ ) ప్రజారోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో మేడ్చల్ డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ మౌనిక శుక్రవారం మేడ్చల్ పట్టణంలో మెరుపు తనిఖీలు చేపట్టారు. మేడ్చల్ పరిధిలోని ఐదు ప్రముఖ వ్యాపార సంస్థల్లో ఆమె ఆకస్మికంగా సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కిరాణా షాపులు, ఫ్యాన్సీ స్టోర్లు, బ్యూటీ పార్లర్లలో విక్రయిస్తున్న వివిధ రకాల ఉత్పత్తుల నాణ్యత, గడువు తేదీలు, లేబులింగ్ మరియు ప్రభుత్వ నిబంధనల అమలును ఆమె క్షుణ్ణంగా పరిశీలించారు.

### క్షేత్రస్థాయిలో విస్తృత సోదాలు.. ఉత్పత్తుల పరిశీలన :

తనిఖీల్లో భాగంగా డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ మౌనిక ఆయా వ్యాపార సముదాయాల్లోని నిల్వలను తనిఖీ చేశారు. నిత్యం ప్రజలు వినియోగించే సబ్బులు, పౌడర్లు, లోషన్ల నాణ్యతను పరిశీలించారు. యువత ఎక్కువగా కొనుగోలు చేసే ఫేస్ పౌడర్లు, క్రీములు, లిప్ బామ్స్‌ను తనిఖీతో పాటు మహిళల సౌందర్య సాధనాలైన ఫేస్ క్రీములు, బ్యూటీ పౌడర్లు మరియు ఇతర కాస్మెటిక్ ఉత్పత్తులను పరిశీలించి, వాటి నాణ్యత ప్రమాణాలపై నిర్వాహకులకు అవగాహన కల్పించారు.

### ఇన్‌స్పెక్టర్ మౌనిక చొరవపై స్థానికుల ప్రశంసలు :

విధుల పట్ల అంకితభావంతో పనిచేస్తూ, ప్రజారోగ్య రక్షణ కోసం నిరంతరం క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహిస్తున్న డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ మౌనికపై స్థానికులు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. నిబంధనల అమలులో ఎక్కడా రాజీపడకుండా, ప్రజల భద్రతే పరమావధిగా ముందుకు సాగుతున్న ఆమె ప్రత్యేక చొరవను పలువురు కొనియాడుతున్నారు. ఇటువంటి ఆకస్మిక తనిఖీలు భవిష్యత్తులోనూ కొనసాగించాలని ప్రజలు కోరుతున్నారు.

### ప్రజారోగ్యంతో ఆటలాడితే చట్టపరమైన చర్యలు తప్పవు : డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ మౌనిక

ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే ఉత్పత్తుల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోం. వ్యాపారులు తప్పనిసరిగా చట్టబద్ధమైన ఉత్పత్తులనే విక్రయించాలి. గడువు ముగిసిన వస్తువులను విక్రయిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవు.

# ఇసుక మామూలు వసూలు

## రెవెన్యూ రూలా.? రౌడీ రూలా.?

**డీడీ కట్టినా ఫోన్‌పే చేయాల్సిందే.?**

**ఇందిరమ్మ ఇంటికి ఇసుక కావాలంటే ఆఫీసర్ల జేబు నింపాల్సిందే**

**రేపటి డీడీ కావాలా.? ఈరోజు డబ్బులు కొట్టు': బెదిరింపుల పర్వం**

**సమగ్ర విచారణకు ట్రాక్టర్ యజమానుల డిమాండ్:**





ఎటూరునాగారం(ప్రశ్న న్యూస్) ములుగు జిల్లా ఎటూరునాగారం గోదావరి పరివాహక ప్రాంతంలో ఇసుక రవాణా చేసే ట్రాక్టర్ యజమానులపై కొంతమంది రెవెన్యూ అధికారుల దౌర్జన్యం రోజురోజుకూ మితిమీరుతోంది. ప్రైవేటు భవనాలతో పాటు ప్రభుత్వం పేదలకు కేటాయించిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం నిబంధనల ప్రకారం డీడీలు చెల్లించి ఇసుక తోలుతున్నా, అధికారుల 'అదనపు వసూళ్ల'కు అంతే లేకుండా పోయింది.

### డిజిటల్ మామూలు దందా.?

ట్రాక్టర్ యజమానులు తెలిపిన వివరాల ప్రకారం, ఉదయం ప్రభుత్వానికి డీడీ కడితే సరిపోదు. సాయంత్రం అయ్యేసరికి సంబంధిత రెవెన్యూ అధికారుల నుంచి ఫోన్ వస్తుందని, తమ ఫోన్‌పే నెంబర్లకు మామూలు పంపించాలని బోడ జనార్ధన్ విఆర్ఓ బహిరంగంగానే డిమాండ్ చేస్తున్నారని ఇలాంటి అధికారులను తక్షణమే సస్పెండ్ చేయాలి లేకపోతే రెవెన్యూ డిపార్ట్మెంట్ అందరికీ చెడ్డ పేరు వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. డబ్బులు ఇవ్వకపోతే రేపటి డీడీ ఇవ్వం అంటూ బెదిరింపులకు దిగుతున్నారని వాపోయారు. దీంతో డీడీ అంటే డిమాండ్ డ్రాఫ్ట్ కాస్తా డైలీ డబ్బులుగా మారిపోయిందని ట్రాక్టర్ డ్రైవర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### ఒక్క డీడీ.. 12 ట్రాక్టర్లు:



ఇదిలా ఉండగా, ప్రభుత్వ భూముల్లో నిర్మిస్తున్న పెద్ద భవనాలకు మాత్రం అధికారుల సహకారం పుష్కలంగా ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక్క డీడీ ఆధారంగా ఏకంగా 12 ట్రాక్టర్ల ఇసుకను తరలిస్తున్నారని, ఈ అక్రమ దందాకు సహకరిస్తున్న అధికారులకు సాయంత్రం వేళ 'ఎంత' ముడుతోందనేది బహిరంగ రహస్యంగా మారిందని స్థానికులు చెబుతున్నారు.

### విచారణకు డిమాండ్..

రోజువారీ వేధింపులు భరించలేక ఎటూరునాగారం ట్రాక్టర్ యజమానుల సంఘం ఈ దందాపై సమగ్ర విచారణ జరిపించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తోంది. నిజమైన అక్రమార్కులను వదిలేసి, నిబంధనల ప్రకారం ఇసుక తీసుకెళ్లే వారినే అధికారులు టార్గెట్ చేయడం దారుణమని మండిపడుతున్నారు. పేదవాడి సొంతింటి కలను కొందరు



అధికారులు సొమ్ము చేసుకుంటున్న తీరుపై ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## జూన్ 21న అత్యంత పొడవైన పగలు, అత్యంత చిన్న రాత్రి

**పిడుగురాళ్ల** ప్రతి సంవత్సరం జూన్ 21 తేదీకి ప్రత్యేకమైన ఖగోళ, ఆధ్యాత్మిక ప్రాధాన్యత ఉంటుంది. ఈ రోజును ప్రపంచవ్యాప్తంగా అంతర్జాతీయ యోగా దినోత్సవంగా జరుపుకుంటారు. అదే సమయంలో, సంవత్సరంలో అత్యంత పొడవైన పగలు, అత్యంత చిన్న రాత్రిగా గుర్తించబడుతుంది. ఈ ఘటనను వేసవి అనంతరం వచ్చే ఈ కాలానికి విశేష ప్రాముఖ్యత ఉంది. జూన్ 21నే అత్యంత పొడవైన పగలు ఎందుకు భూమి తన అక్షంపై సుమారు 23.5 డిగ్రీల కోణంలో వంగి సూర్యుని చుట్టూ పరిభ్రమిస్తుంది. ఈ కారణంగానే ఋతువులు, పగలు-రాత్రుల వ్యవధిలో మార్పులు చోటుచేసుకుంటాయి. జూన్ 21 సమయంలో ఉత్తరార్ధగోళం సూర్యుని వైపు అత్యధికంగా వంగి ఉంటుంది. దీంతో సూర్యకిరణాలు కర్కాటక రేఖ పై దాదాపు నేరుగా పడతాయి. ఫలితంగా సూర్యుడు ఎక్కువసేపు ఆకాశంలో కనిపిస్తాడు. ఈ రోజున 13 నుంచి 14 గంటల వరకు పగటి వెలుతురు ఉంటుంది. ఇదే కారణంగా జూన్ 21ను సంవత్సరంలో అత్యంత పొడవైన రోజుగా పరిగణిస్తారు. ఈ రోజున సూర్యుడు ఉత్తర దిశలో తన గరిష్ఠ స్థానానికి చేరుకుంటాడు. ఆ తర్వాత క్రమంగా దక్షిణ దిశగా ప్రయాణించడం ప్రారంభిస్తాడు. అందువల్ల జూన్ 21 తర్వాత పగటి సమయం క్రమంగా తగ్గుతూ, రాత్రి సమయం పెరుగుతూ ఉంటుంది. అందుకే ప్రపంచవ్యాప్తంగా జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవంను నిర్వహించడం కూడా విశేష ప్రాధాన్యతను సంతరించుకుంది.

## నరసరావుపేట ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ మద్దెల వెంకట సతీష్ బాబు బాధ్యతల స్వీకరణ

**- మర్యాద పూర్వకంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు ను కలిసిన సూపరింటెండెంట్**

**నరసరావుపేట** నూతనంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన నరసరావుపేట ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మద్దెల వెంకట సతీష్ బాబు గురువారం రాత్రి స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ లక్కిరెడ్డి వెంకటేశ్వరరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరవింద బాబు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం వైద్య రంగానికి పెద్దపీట వేస్తోందని, ప్రభుత్వ పథకాలు, సేవలను సామాన్య ప్రజలకు అందించేలా చూడాలని సూచించారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ లక్కిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ, ఆసుపత్రిలో వైద్యంతో పాటు పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. రాబోయే రోజుల్లో మదర్ అండ్ చైల్డ్ హాస్పిటల్ నిర్మాణం చేపట్టనున్నట్లు ఆయన వెల్లడించారు. అనంతరం డాక్టర్ సతీష్ బాబు మాట్లాడుతూ, పల్నాడు జిల్లా నరసరావుపేట ప్రాంత ప్రజలకు ఏరియా ఆసుపత్రి కీలక వైద్య కేంద్రంగా సేవలందిస్తోందన్నారు. ప్రతిరోజూ వందలాది మంది పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన రోగులు ఆసుపత్రికి వస్తున్నారని, వారికి నాణ్యమైన, మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తానని తెలిపారు. ప్రభుత్వ వైద్య సేవలు, సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి రోగికి సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. రోగులకు ఇబ్బందులు తలెత్తకుండా వైద్య సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ ఆసుపత్రి సేవల ప్రమాణాలను మెరుగుపరుస్తామని చెప్పారు. ముఖ్యంగా గర్భిణీ విభాగంలో సాధ్యమైనంత వరకు సాధారణ కాన్పులు జరిగేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. తల్లి, శిశు ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ గర్భిణీలకు అవసరమైన వైద్య సేవలు, సలహాలు, పర్యవేక్షణను సమర్థవంతంగా అందిస్తామన్నారు. ఆసుపత్రిలో వైద్య సేవల విస్తరణ, రోగులకు మెరుగైన సౌకర్యాల కల్పన, పారదర్శక పరిపాలనకు ప్రాధాన్యత ఇస్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెడతానని డాక్టర్ సతీష్ బాబు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## కంచర్లపాలెంలో కోపల్లి కార్తీక్ మృతి

**- డీఎస్పీని కలిసిన ఎమ్మార్పీఎస్ బృందం**

**గుంటూరు** తెనాలి ప్రాంతం, కంచర్లపాలెం గ్రామంలో ఇటీవల కోపల్లి కార్తీక్ అనే మాదిగ యువకుడిని వాలీ బాల్ కోర్టులో అర్ధరాత్రి సమయంలో ఉచ్చు బిగించి చంపి తనకు తానే ఉరివేసుకున్నట్లుగా చిత్రీకరించారని తల్లి దండ్రులు తమ ఆవేదనను వెలిబుచ్చారు. ఘటన జరిగి నేటికి నెల రోజులు కావస్తున్నపటికీ కేసును చేధించే విషయంలో తెనాలి పోలీస్ లు అత్యంత నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఈ విషయంపై ఇటీవల తెనాలి ప్రాంతానికి మంద కృష్ణ మాదిగ వచ్చినప్పుడు బాధితులు జరిగిన ఘటన గురించి చెప్పగా వెంటనే బాధితులకు అండగా ఉండాలని గుంటూరు జిల్లా ఎమ్మార్పీఎస్ నాయకత్వాన్ని ఆదేశించడం జరిగింది. ఈ సందర్భం గా ఈరోజు మృతి చెందిన కార్తీక్ తల్లిదండ్రులు, బంధువులు, స్థానిక గ్రామ ప్రజలతో ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు డా మున్నంగి నాగరాజు మాదిగ నాయకత్వం లో గుంటూరు జిల్లా ఎమ్మార్పీఎస్ ప్రతినిధి బృందం ర్యాలీ గా వెళ్ళి తెనాలి ఆూఖ ని కలవడం జరిగింది. కార్తీక్ అనుమానాస్పద మృతి కేసు విషయంలో ఇప్పటివరకు పోలీస్ ఎలాంటి విచారణ జరిగింది. ఎందుకు ఈ కేసును నిర్లక్ష్యం చేశారు అని ప్రశ్నించడం జరిగింది. ఇప్పటివరకు ఈ కేసులో చేసిన ఇన్వెస్టిగేషన్ ను ఎమ్మార్పీఎస్ ప్రతినిధి బృందానికి తెలియజేయాలని డిమాండ్ చేయడం జరిగింది. ఈ విషయంపై పోలీసులు తమ దగ్గరవున్న కొన్ని ఆధారాలను బహిర్గతం చేశారు.

## రాముడి పేరుతో ఓట్లు.. కార్పొరేట్ల కోసం పాలన

**తూంకుంట నర్సారెడ్డి విమర్శలు**

**రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా గజ్వేల్‌లో రక్తదాన, అన్నదాన కార్యక్రమాలు**



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మతాన్ని, దేవుళ్లను రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగించుకుంటూ అధికారాన్ని నిలబెట్టుకునే ప్రయత్నం చేస్తోందని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి విమర్శించారు. సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఆంక్షా రెడ్డితో కలిసి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదినోత్సవం సందర్భంగా గజ్వేల్ పట్టణంలో నిర్వహించిన రక్తదాన శిబిరం, అన్నదాన కార్యక్రమం, విద్యార్థులకు పూల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా నర్సారెడ్డి మాట్లాడుతూ, శ్రీరాముడిని కోట్లాది మంది భక్తితో ఆరాధిస్తారని, అయితే బీజేపీ మాత్రం శ్రీరాముడి పేరును ఎన్నికల రాజకీయాలకు వినియోగిస్తోందని ఆరోపించారు. ప్రజల విశ్వాసాలను ఓట్లుగా మలచుకోవడమే బీజేపీ రాజకీయ ఎజెండాగా మారిందని విమర్శించారు. నిరుద్యోగం, ధరల పెరుగుదల, రైతుల సమస్యలు, యువత భవిష్యత్తు వంటి కీలక అంశాలను పక్కనబెట్టి భావోద్వేగ రాజకీయాలకు ప్రాధాన్యం ఇస్తోందని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం సామాన్య ప్రజల కంటే కార్పొరేట్ శక్తుల ప్రయోజనాలకే పెద్దపీట వేస్తోందని ఆయన ఆరోపించారు. దేశ సంపద కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతమవుతోందని, పేదలు మరింత పేదరికంలోకి నెట్టబడుతున్నారని అన్నారు. రైతులు, కార్మికులు, నిరుద్యోగ యువత, మధ్యతరగతి వర్గాల సమస్యలను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేషన్ చైర్మన్ మడుపు భూమారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్లు నరేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, విజయమోహన్, వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, పీసీసీ కార్యదర్శి నెంటూరు రంగారెడ్డి, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కరుణాకర్, వివిధ మండలాల కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రాయపోల్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన సీపీ రష్మీ పెరుమాళ్



గజ్వేల్ (ప్రశ్న న్యూస్) సిద్ధిపేట జిల్లా రాయపోల్ పోలీస్ స్టేషన్‌ను పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్, ఐపీఎస్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ సిబ్బంది కిట్ ఆర్టికల్స్‌ను పరిశీలించి, విధుల్లో పాటించాల్సిన క్రమశిక్షణ, పనితీరు ప్రమాణాలపై పలు సూచనలు చేశారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహిస్తున్న రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించిన సీపీ, పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలు, దర్యాప్తు పురోగతి గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తదుపరి రాయపోల్ పోలీస్ స్టేషన్ నూతన భవన నిర్మాణానికి ప్రభుత్వం కేటాయించిన స్థలాన్ని స్వయంగా పరిశీలించి, నిర్మాణ పనుల పురోగతిపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా స్టేషన్ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించిన సీపీ, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, శాంతిభద్రతల పరిరక్షణకు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. అలాగే "సిద్ధిపేట సురక్ష నేత్ర" కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామంలో సీసీటీవీ కెమెరాల ఏర్పాటు కోసం ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఉద్యోగ అవకాశాల కోసం ప్రయత్నిస్తున్న యువతకు సిద్ధిపేట పోలీస్ ఉద్యోగ మిత్ర వెబ్‌సైట్ గురించి పూర్తి స్థాయిలో అవగాహన కల్పించి, దాని ద్వారా లభించే సేవలను ప్రజలకు చేరవేయాలని సూచించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో గజ్వేల్ ఏసీపీ నర్సింహులు, సీఐ లతీఫ్, సీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, ఎస్సై మానసతో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ‘వంద దేవుళ్ళు’ మూవీ రివ్యూ




‘బిచ్చగాడు’ చిత్రంతో తెలుగులో హీరోగా గుర్తింపు తెచ్చుకున్న తమిళ కథానాయకుడు విజయ్ ఆంటోని ఆ తరువాత పలు అనువాద చిత్రాలతో తెలుగు ప్రేక్షకులను పలకరించాడు. అయితే ‘బిచ్చగాడు’ స్థాయి విజయాన్ని మాత్రం అందుకోలేకపోయాడు. ఈ సారి ‘బిచ్చగాడు’ చిత్ర దర్శకుడు శశి దర్శకత్వంలో ఆయన నటించిన చిత్రం ‘వంద దేవుళ్ళు’తో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. బిచ్చగాడు తరహాలోనే ఈ చిత్రం కూడా అమ్మ కథాంశంతో కావడం విశేషం. ఈ శుక్రవారం ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రంతో విజయ్ ఆంటోని విజయాన్ని అందుకున్నాడా? ఈ చిత్రంలోని అమ్మ సెంటిమెంట్ ఎంత వరకు వర్కవుట్ అయ్యింది అనేది రివ్యూలో తెలుసుకుందాం. భర్త మరణంతో ఒంటరి మహిళగా సమాజంలో బ్రతుకుతూ తన పిల్లలకు తనే సర్వం అయ్యి పిల్లలను చదివించి, వారిని ఉన్నతస్థానంలో చూడాలని, అందుకోసం కూలీ పని చేస్తూ పిల్లలను పెంచుతుంది వాసవి (శ్వాసిక). సమాజంలో ఒక ఒంటరి మహిళ అనుభవించే అవమానాలు, కష్టాలు అన్నీ ఎదుర్కొంటూ పిల్లలను పెద్ద చదువులు చదివిస్తుంది. అయితే ఊర్లో భర్త లేని మహిళను ఇరుగు పొరుగు వారు చూసే పద్దతి, వారి అవమానపు మాటలు భరించలేక మళ్లీ పెళ్లి చేసుకుంటే ఈ సూటిపోటి మాటల నుంచి విముక్తి కలుగుతుందని భావిస్తుంది. తమ టీచర్ ద్వారా తల్లి పెళ్లి ఆలోచన గురించి తెలుసుకున్న పెళ్లి వయసుకు వచ్చిన వాసవి పెద్ద కొడుకు అమ్మ నిర్ణయంపై ఎంతో మండిపడతాడు. చిన్న కొడుకు కూడా మొదట్లో తల్లి నిర్ణయాన్ని తప్పుబడతాడు. అసలు కొడుకులిద్దరూ అమ్మ నిర్ణయాన్ని ఎందుకు స్వాగతించలేదు. ఆ తరువాత అదే కొడుకులు అమ్మకు పెళ్లి చేయడానికి ఎంత తపనపడతారు? ఇందుకోసం వారి ప్రాణాలు తెగించి ఊరి పెద్దలతో ఎందుకు ఫైట్ చేశారు? వాసవికి, ఏడుకొండలు( విజయ్ ఆంటోని)కి పెళ్లి జరిగిందా? అనేది మిగతా కథ భర్త చనిపోయిన తరువాత ఓ మహిళ అమ్మగా, ఒంటరిగా తన పిల్లలను ప్రయోజకులను చేయడానికి తను అంతా కోల్పోయి, తన జీవితాన్ని పణంగా పెట్టి పిల్లలను ప్రయోజకులను చేయడానికి అహర్నిశలు శ్రమిస్తుంటుంది. తనకు ఓ జీవితం ఉందనే విషయాన్ని మరిచిపోతుంది. ఇలాంటి ఓ కథాంశంతో అమ్మ కూడా ఓ మనిషే. ఆమెకు మనసుంటుంది. అది తెలియక ఆమె జీవితాన్ని కూడా మనమే బతికేయకూడదు అనే ఓ పర్పస్‌ఫుల్ కథతో, అమ్మ సెంటిమెంట్‌తో దర్శకుడు శశి ఈ చిత్రాన్ని తెరకెక్కించాడు. ప్రస్తుత సమాజంలో పల్లెటూర్లలో ఉన్న కట్టుబాట్లు, సంప్రాదాయం పేరిట ఉన్న ఇలాంటి విచిత్ర ధోరణుల కారణంతో ఎంతో మంది అమ్మల జీవితాలు ఆరంభ దశలోనే ముగిసిపోతున్నాయనే విషయాన్ని ఈ చిత్రంలో చూపించారు. వాసవి జీవితంతో మొదలైన ఈ కథలో ఒంటరి మహిళగా ఆమె సమాజంలో పడే సంఘర్షణ, అమ్మ, కొడుకుల ప్రేమ ఇవన్నీకథను ముందుకు నడిపించాయి. పిల్లలు పెద్దవ్వడం, ఉద్యోగాలు, ప్రేమ, వీటితో పాటు వాసవికి మరో జీవితం ఇవ్వాలనే కొడుకుల ఆలోచన ఇవన్నీ ఆసక్తిగానే కొనసాగుతాయి. కథనం స్లోగా కొనసాగిన భావోద్వేగాలు పండటంతో ప్రేక్షకుడు కథలో లీనమవుతాడు. ప్రథమార్థం సాగదీసినట్లుగా, అక్కడక్కడా బోరింగ్ సన్నివేశాలతో ముగుస్తుంది. ఇక ద్వితీయార్థంలోనూ ప్రేక్షకుడి ఊహించిన కథే జరుగుతుందటంతో పెద్ద ఆసక్తికరంగా అనిపించదు. అయితే కథను నడిపిన విధానం, స్ర్కీన్‌ప్లే ఆకట్టుకుంటుంది. వాసవి పెళ్లికి ఎదురయ్యే సమస్యలు, వాటిని కొడుకు వివేక్ ఎలా అధిగమించాడు? ఏడుకొండలు పాత్ర పరిచయం ఈ సన్నివేశాలన్నీ కథను ఇంట్రెస్టింగ్‌గా కొనసాగించేటట్లు చేశాయి. ఏడుకొండలు పాత్రను డిజైన్ చేసిన విధానం అలరిస్తుంది. ఏడుకొండలు, వాసవి మధ్య సన్నివేశాలు క్యూట్‌గా, మనసుకు ఆహ్లాదంగా అనిపిస్తాయి. ఈ సినిమా చూస్తుంటే అందరికి తెలుగులో వచ్చిన ‘మా నాన్నకి పెళ్లి’ సినిమా గుర్తుకు వస్తుంది. అయితే ఆ చిత్రంలో కథ నాన్న పెళ్లి చుట్టూ అల్లుకుంటే ఈ సినిమాలో అమ్మ పెళ్లి నేపథ్యంతో కథ ఉంటుంది. అయితే ఈ సినిమాలో కొన్ని సన్నివేశాలు మళ్లీ మళ్లీ చూస్తున్న భావనను కలిగిస్తాయి. సాధారణంగా ఇలాంటి సినిమాల్లో పతాక సన్నివేశాలు పాఠాలు చెబుతున్నట్లుగా పేజీల కొద్ది పవర్‌ఫుల్ డైలాగులతో ఉంటాయి. కానీ ఈ సినిమాలో సింపుల్‌గా ఎంటర్‌టైన్‌మెంట్‌వేలో ముగించిన విధానం బాగుంది. అయితే రచన పరంగా ఈసినిమాను మరింత బలంగా రాసుకుని ఉంటే పూర్థిస్థాయిలో అలరించే అవకాశం ఉండేది. వాసవి పాత్రలో శ్వాసిక నటన ఈ చిత్రానికి ప్రాణం. ఆమె నటన ఎంతో సహజంగా, భావోద్వేగంగా అనిపిస్తుంది. సంభాషణలకు మించి ఆమె హావాభావాల్లో చూపెట్టిన ప్రతిభ మెప్పిస్తుంది. ఏడుకొండలుగా విజయ్ ఆంటోని పాత్ర నిడివి తక్కువైనా తనదైన నటనతో అలరించాడు. కొడుకులుగా భాస్కర్, దీషన్ నటన పర్వాలేదు. కావ్య అనిల్, లిజోమోల్ జోస్, కరుణాస్, బాలాజీ శక్తివేల్ నటన గుర్తుండిపోతుంది. పాటలు, నేపథ్య సంగీతం కథను వేగంగా నడిపించడానికి దోహదపడ్డాయి. సినిమాటోగ్రఫీ, ఎడిటింగ్ బాగానే కుదిరాయి.

ఈ సినిమాలో సంభాషణలు కొన్ని గుర్తుండిపోతాయి. దర్శకుడు తను చెప్పాలనుకున్న అంశాన్ని నిజాయితీగా చెప్పే ప్రయత్నం చేశాడు. ‘వంద దేవుళ్ళు’ చిత్రాన్ని ‘బిచ్చగాడు’ను దృష్టిలో పెట్టుకుని వెళితే ఈ సినిమా విషయంలో నిరాశపడతారు. నెమ్మదిగా సాగే కథనం, అక్కడక్కడా బోరింగ్ సన్నివేశాలను మినహాయిస్తే సెంటిమెంట్ సినిమాలు, కుటుంబ బావోద్వేగాల చిత్రాలను ఇష్టపడే వారిని ఈ సినిమా సంతృప్తి పరుస్తుంది.

# రష్మిక ‘మైసా’ నుంచి అప్‌డేట్..
## సాంగ్ షూటింగ్ పూర్తి!



స్టార్ హీరోయిన్ రష్మిక మందన్న ప్రధాన పాత్రలో నటిస్తున్న యాక్షన్ థ్రిల్లర్ ‘మైసా’ నుంచి ఒక ఆసక్తికరమైన అప్‌డేట్ వచ్చింది. ఈ సినిమాలోని ఒక కీలకమైన పాట చిత్రీకరణ పూర్తయినట్లు చిత్ర దర్శకుడు రవీంద్ర పుల్లే వెల్లడించారు. తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో సెట్స్‌కు సంబంధించిన ఫోటోను పంచుకుంటూ, “చవీఎయ్యి సాంగ్ ప్యాకప్” అని ఆయన పోస్ట్ చేశారు. రష్మికపై చిత్రీకరించిన ఈ పాటకు ప్రముఖ కొరియోగ్రాఫర్ బృందా మాస్టర్ నృత్య దర్శకత్వం వహించారు. ఈ చిత్రం ప్రకటించినప్పటి నుంచే ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇటీవల కేరళలో ఈ సినిమాకు సంబంధించి ఒక సుదీర్ఘ షెడ్యూల్ పూర్తయిన సంగతి తెలిసిందే. ఆ షెడ్యూల్‌లో స్టంట్ మాస్టర్ కెచా కంపాక్డీ పర్యవేక్షణలో భారీ యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరించారు. ఇందులో రష్మిక స్వయంగా కొన్ని హై-ఇంటెన్సిటీ యాక్షన్ సీక్వెన్స్‌లలో నటించినట్లు సమాచారం. ఈ యాక్షన్ సన్నివేశాల్లో సహజంగా నటించేందుకు రష్మిక థాయ్‌లాండ్‌లోని బ్యాంకాక్‌లో ప్రత్యేక శిక్షణ తీసుకున్నారు. అక్కడ రోజూ 8 గంటల పాటు శ్రమించి, అంతర్జాతీయ నిపుణుల వద్ద అధునాతన స్టంట్స్, హ్యాండ్-టు-హ్యాండ్ కంబాట్ వంటివి నేర్చుకున్నారు. ఈ చిత్రంలో రష్మిక ఒక గిరిజన (గోండు) యువతి పాత్రలో కనిపించనున్నారు. శారీరకంగా, మానసికంగా ఎంతో శ్రమ అవసరమైన ఈ పాత్ర కోసం ఆమె ప్రత్యేకంగా సిద్ధమయ్యారు. అంతర్జాతీయ యాక్షన్ డైరెక్టర్ ఆండీ లాంగ్ ఈ చిత్రానికి స్టంట్స్ పర్యవేక్షిస్తున్నారు. రష్మికతో పాటు ఈశ్వరీ రావు, గురు సోమసుందరం, రావు రమేశ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. శ్రేయాస్ పి కృష్ణ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, జేక్స్ బిజోయ్ సంగీతం సమకూరుస్తున్నారు.

## తినాలని ఉన్నా తినలేని స్థితిని అనుభవించా: సమంత



సెలబ్రిటీల శారీరక ఆకృతి, బరువుకు సంబంధించి సోషల్ మీడియాలో నిరంతరం సాగే చర్చలపై ప్రముఖ కథానాయిక సమంత తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. గత కొన్ని రోజులుగా తను సన్నబడటంపై నెటిజన్లు చేస్తున్న కామెంట్లకు ఆమె ఘాటుగా సమాధానమిచ్చారు. తాను కావాలని ఎలాంటి డైటింగ్ చేయలేదని, తీవ్రమైన ‘మయోసైటిస్’ (కండరాల వాపు వ్యాధి) బారిన పడటం వల్లే తన బరువు తగ్గాల్సి వచ్చిందని స్పష్టం చేశారు. ఎదుటివారి జీవితంలో ఏం జరుగుతుందో తెలుసుకోకుండా సులభంగా విమర్శలు చేయడం సరికాదని హితవు పలికారు. తన తాజా ఇంటర్వ్యూలో సమంత మాట్లాడుతూ.. “గతంతో పోలిస్తే ఇప్పుడు నా ఆరోగ్యం కుదుటపడింది. కావాల్సిన ఆహారాన్ని తీసుకోగలుగుతున్నాను. అయితే, అతిగా తింటే మయోసైటిస్‌పై ప్రభావం పడుతుందన్న వైద్యుల సూచన మేరకు ప్రస్తుతం మితంగానే తింటున్నాను. తీవ్ర అనారోగ్య పరిస్థితుల కారణంగా నాకు తినాలని ఉన్నా తినలేని నిస్సహాయ స్థితిని అనుభవించాను. అంతే తప్ప, అందం కోసం డైటింగ్ చేసి బరువు తగ్గలేదు” అని చెప్పారు. తన పెంపుడు పిల్లికి ‘జెలాటో’ (ఒక రకమైన ఐస్‌క్రీమ్) అని పేరు పెట్టడం వెనుక ఉన్న కారణాన్ని సామ్ వివరించారు. మయోసైటిస్ చికిత్సలో భాగంగా దాదాపు రెండేళ్ల పాటు ఎలాంటి ఉప్పు, కారం లేని పరిమిత ఆహారాన్ని మాత్రమే తీసుకోవాల్సి వచ్చిందని చెప్పారు. ఆ కఠినమైన రోజుల్లో కోలుకున్న తర్వాత వైద్యులు మొదటిసారిగా ‘చక్కెర లేని జెలాటో ఐస్‌క్రీమ్’ తినడానికి అనుమతించారని, ఆ జ్ఞాపకార్థమే తన పిల్లికి ఆ పేరు పెట్టినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా, సమంత ప్రధాన పాత్రలో నటించిన లేడీ ఓరియెంటెడ్ చిత్రం ‘మా ఇంటి బంగారం’ నేడు ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదలైంది.

# వినోదాల పండుగకు శ్రీకారం




అగ్ర కథానాయకులు వెంకటేష్-కల్యాణ్‌రామ్ నటిస్తున్న భారీ మల్టీస్టారర్ గురువారం హైదరాబాద్‌లో ఘనంగా ప్రారంభమైంది. అనిల్ రావిపూడి దర్శకత్వంలో షైన్‌స్ర్కీన్స్ పతాకంపై సాహు గారపాటి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కీర్తి సురేష్, కృతిశెట్టి కథానాయికలు. నాయకానాయికలపై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి అల్లు అరవింద్ క్లాప్‌నివ్వగా, సురేష్‌బాబు కెమెరా స్విఛాన్ చేశారు. ప్రముఖ దర్శకుడు కె.రాఘవేంద్రరావు తొలి సన్నివేశానికి గౌరవ దర్శకత్వం వహించారు. వచ్చే ఏడాది సంక్రాంతికి ఈ సినిమా ప్రేక్షకుల ముందుకురానుంది. దర్శకుడు అనిల్ రావిపూడి శైలిలో ఆద్యంతం హాస్యభరితంగా సాగే చిత్రమిదని, సంక్రాంతి బరిలో వినోదాల పండగలా ప్రేక్షకుల్ని అలరిస్తుందని, త్వరలో రెగ్యులర్ షూటింగ్ మొదలుపెడతామని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: సమీర్ రెడ్డి, ఆర్ట్: ఏఎస్ ప్రకాష్, సంగీతం: జీవీ ప్రకాష్‌కుమార్, సమర్పణ: సురేష్ ప్రొడక్షన్స్, జీ స్టూడియోస్, అర్చన, నిర్మాత: సాహు గారపాటి, రచన-దర్శకత్వం: అనిల్ రావిపూడి.

## బాలయ్య సరసన కాజల్.. ఫస్ట్ లుక్ వచ్చేసింది!



నందమూరి బాలకృష్ణ హీరోగా, మాస్ డైరెక్టర్ గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కుతున్న ప్రతిష్ఠాత్మక చిత్రం ‘NBK111’ నుంచి ఓ ఆసక్తికరమైన అప్‌డేట్ వచ్చింది. హీరోయిన్ కాజల్ అగర్వాల్ పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్రంలో ఆమె నటిస్తున్నట్లు అధికారికంగా ప్రకటిస్తూ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. దీంతో సినిమాపై ఉన్న అంచనాలు మరింత పెరిగాయి. ఈరోజు విడుదల చేసిన పోస్టర్‌లో కాజల్ సింపుల్ చీరకట్టులో, కళ్లజోడు ధరించి ఎంతో గంభీరంగా, సీరియస్ లుక్‌తో కనిపించారు. దీంతో ఈ సినిమాలో ఆమె పాత్రపై ప్రేక్షకుల్లో క్యూరియాసిటీ మొదలైంది. ఈ సందర్భంగా చిత్ర బృందం కాజల్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ, ఈ సినిమా ఆమె కెరీర్‌లో ప్రత్యేకంగా నిలిచిపోతుందని పేర్కొంది. ‘భగవంత్ కేసరి’ చిత్రం తర్వాత బాలకృష్ణ, కాజల్ కాంబినేషన్‌లో వస్తున్న రెండో సినిమా ఇది. ఆ సినిమాలో కాజల్ పాత్రకు మంచి మార్కులు పడ్డాయి. అయితే, NBK111’లో మాత్రం ఆమె పూర్తిస్థాయి హీరోయిన్‌గా, కథను కీలక మలుపు తిప్పే పాత్రలో కనిపించనున్నట్లు ఇండస్ట్రీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. భారీ యాక్షన్, ఎమోషన్స్‌తో భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ చిత్రానికి తమన్ సంగీతం అందిస్తున్నారు.

# లక్ష్మి పాత్ర ఓ సవాలు



‘ఇందులో నా పాత్ర పేరు లక్ష్మి. పక్కింటి అమ్మాయిలా సహజంగా అనిపించే పాత్ర. మేకప్ లేకుండా నటించాను. భర్తకు ప్రతి విషయాల్లోనూ సపోర్ట్‌గా నిలిచే ఓ చక్కటి గృహిణి పాత్ర నాది. నా రియల్ లైఫ్‌కి పూర్తి వ్యతిరేకమైన ఈ తరహా పాత్ర చేయడం నిజంగా నాకొక ఛాలెంజే’ అని కథానాయిక రాశీసింగ్ అన్నారు. వడ్డే నవీన్ హీరోగా నటించి, నిర్మించిన చిత్రం ‘ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు’. కమల్‌తేజ నార్ల దర్శకుడు. ఈ నెల 19న సినిమా విడుదల కానున్నది. ఈ సందర్భంగా గురువారం రాశీసింగ్ హైదరాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు. ‘వడ్డే నవీన్ హీరో అని తెలిశాక, ఆయన నటించిన సినిమాలపై సెర్చ్ చేశాను. నిజంగా ఆ హిట్స్ చూసి షాక్ అయ్యాను. ‘యాక్టింగ్‌కి ఇంత గ్యాప్ ఇచ్చారెందుకు?’ అని ముందుగా నేనే ఆయన్ను అడిగాను. నవీన్ నిజంగా చాలా ఇంటలెక్చువల్. ఆయన దగ్గర వరల్డ్ నాలెడ్జ్ ఎక్కువగా ఉంటుంది. కానీ సోషల్ మీడియాకు మాత్రం ఆయన దూరం. నేనే బలవంతంగా ఇన్‌స్టా అకౌంట్ ఓపెన్ చేయించాను. ఈ సినిమాలో ఆయన పాత్ర చాలా కొత్తగా ఉంటుంది’ అని తెలిపింది రాశీసింగ్. దర్శకుడు కమల్‌తేజ్ పూర్తి క్లారిటీ ఉన్న దర్శకుడని, అనుకున్న అవుట్‌పుట్ వచ్చేవరకూ తను రాజీ పడడని, ఆయనతో జర్నీ చాలా స్మూత్‌గా ఉంటుందని, రీసెంట్‌గా సినిమా మొత్తం చూశానని, అద్భుతంగా అనిపించిందని, ముఖ్యంగా క్లైమాక్స్ ట్విస్ట్ సూపర్ అని రాశీసింగ్ పేర్కొన్నారు. ప్రస్తుతం ‘గాసిప్’ అనే ఓటీటీ సినిమా చేస్తున్నట్టు, మరికొన్ని సినిమాలు చర్చల దశలో ఉన్నట్టు రాశీసింగ్ తెలిపింది.

# డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన 143 మందికి జరిమానాలు

**- వేములవాడ పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ : వీరప్రసాద్**



వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ పట్టణంలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 143 మందిని లోక్ అదాలత్‌లో భాగంగా కోర్టులో హాజరుపరచగా మేజిస్ట్రేట్ వివిధ మొత్తాల జరిమానాలు విధించినట్లు పట్టణ ఇన్‌స్పెక్టర్ వీరప్రసాద్ తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే జరిమానాలతో పాటు జైలు శిక్ష కూడా తప్పదని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

# ప్రీ - ప్రైమరీ స్కూళ్లతో ప్రభుత్వ విద్యకు మరింత బలం

**- జిల్లా విద్యాధికారి : జగన్మోహన్ రెడ్డి**

**- బోయినిపల్లి మండలంలో నూతన ప్రీ-ప్రైమరీ పాఠశాలలు ప్రారంభం**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండల కేంద్రంతో పాటుగా కొదురుపాక,గుండన్నపల్లి, కోరెం గ్రామాల్లో నూతనంగా మంజూరైన ప్రీ-ప్రైమరీ పాఠశాలలను శుక్రవారం జిల్లా విద్యాధికారి జగన్మోహన్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించడంతో పాటు బోయినిపల్లి జడ్పీహెచ్ఎస్‌లో నిర్మించిన అదనపు తరగతి గదిని ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఈఓ జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం నాణ్యమైన విద్య అందించేందుకు ప్రీ-ప్రైమరీ పాఠశాలలను ఏర్పాటు చేసిందని, నాలుగు సంవత్సరాలు నిండిన చిన్నారులను తప్పనిసరిగా చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. ప్రతి పాఠశాలకు ఉపాధ్యాయుడు, ఆయా నియామకంతో పాటు రూ. 1.50 లక్షల నిధులు కేటాయించి ఫర్నిచర్, ఆటబొమ్మలు, ఆకర్షణీయమైన తరగతి గదులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు నల్ల మోహన్, కొప్పుల లావణ్య, జంపుక మాధవి,డాక్టర్ కత్తెరపాక మంజుల, వార్డు సభ్యులు చౌదరి శ్రీధర్, అమ్మిగల్ల గోపాల్, నాయకులు మెరుపుల జలంధర్, అమ్మ ఆదర్శ పాఠశాల అధ్యక్షురాలు పిట్టల జలజ, హెడ్‌మాస్టర్లు కనుకయ్య, సత్యనారాయణ, భూమయ్య, బొలగం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కులం పేరుతో దూషించారని మోచి సంఘం అధ్యక్షుడు ముత్యం ఆరోపణ

**- జిల్లా ఎస్పీకి ఫిర్యాదు - ఆలయ ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలి**

**- మోచి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు : కొండ్లెపు ముత్యం**



వేములవాడ (ప్రశ్న న్యూస్)రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడలో తనను కులం పేరుతో దూషిస్తూ మానసిక వేధింపులకు గురిచేశారని తెలంగాణ రాష్ట్ర మోచి సంఘం అధ్యక్షుడు కొండ్లెపు ముత్యం ఆరోపించారు. ఈ మేరకు జిల్లా ఎస్పీకి శుక్రవారం ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ముత్యం మాట్లాడుతూ భీమేశ్వర ఆలయం ఎదురుగా ఉన్న తన దుకాణంలో కొబ్బరికాయలు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నానని, గత వారం రోజులుగా శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అధికారులు, సిబ్బంది తనపై ఒత్తిడి తెస్తున్నారని పేర్కొన్నారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఆదేశాల మేరకు కొందరు సిబ్బంది తన దుకాణంలోకి వచ్చి షాపు తొలగించాలని దౌర్జన్యంగా వ్యవహరించారని ఆరోపించారు. అంతేకాకుండా తనను కులం పేరుతో దూషిస్తూ అవమానించారని, మోచి సంఘానికి చెందిన వ్యక్తివి అయితే రోడ్డుపై షాపు పెట్టుకుంటావా అంటూ వ్యాఖ్యలు చేశారని ముత్యం తెలిపారు. ఈ ఘటన సమయంలో పలువురు స్థానికులు అక్కడే ఉన్నారని పేర్కొన్నారు. తనను కులం పేరుతో దూషించి మానసికంగా వేధించిన దేవస్థానం అధికారులు, సిబ్బందిపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ చట్టంతో పాటు ఇతర సంబంధిత చట్టాల కింద కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీని కోరినట్లు కొండ్లెపు ముత్యం తెలిపారు.

# మార్కండేయ చేనేత సంఘం నూతన సారథిగా నాగుల సత్యనారాయణ

**- చేనేత వృత్తిదారుల సమస్యల పరిష్కారమే లక్ష్యం దిశగా పని చేస్తా**

**- మార్కండేయ చేనేత సంఘం నూతన అధ్యక్షులు : నాగుల సత్యనారాయణ**



వేములవాడ (ప్రశ్న న్యూస్)రాజన్న సిరిసిల్ల జిల్లా,వేములవాడ పట్టణంలోని మార్కండేయ పద్మశాలి చేనేత సంఘానికి నూతన అధ్యక్షుడిగా (అడ్వకేట్) నాగుల సత్యనారాయణ ఎన్నికయ్యారు. సంఘ సభ్యుల మద్దతుతో బాధ్యతలు చేపట్టిన ఆయన, తనపై నమ్మకం ఉంచి గెలిపించిన ప్రతి సభ్యుడికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. చేనేత వృత్తిదారుల సంక్షేమం, సంఘ బలోపేతం, సభ్యుల సమస్యల పరిష్కారం కోసం అంకితభావంతో పనిచేస్తానని ఆయన పేర్కొన్నారు. చేనేత కార్మికుల అభ్యున్నతి కోసం ప్రభుత్వ పథకాలను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, సంఘ అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తామని వెల్లడించారు. నాగుల సత్యనారాయణ అధ్యక్ష పదవిని చేపట్టడం పట్ల సంఘ సభ్యులు, సామాజిక ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు. ఆయన నాయకత్వంలో మార్కండేయ పద్మశాలి చేనేత సంఘం మరింత పురోగతి సాధించి, చేనేత కార్మికులకు మెరుగైన సేవలు అందిస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

# విధులు నిర్వర్తించిన ఆలయ ఉద్యోగులకు బెదిరింపులు

**- పోలీసులకు ఫిర్యాదు చేసిన రాజన్నాలయ ఉద్యోగులు**



వేములవాడ (ప్రశ్న న్యూస్) దక్షిణ కాశీగా పేరు గాంచిన ప్రముఖ శైవక్షేత్రమైన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం పరిధిలోని భూముల ఆక్రమణల అంశం మరోసారి చర్చనీయాంశమైంది .భీమేశ్వరాలయం ఎదురుగా ఉన్న దేవస్థానం స్థలంలో నిర్మాణాలు చేపట్టిన విషయమై విచారణకు వెళ్లిన దేవస్థానం సిబ్బందిని సంబంధిత వ్యక్తి బెదిరించినట్లు ఉద్యోగులు ఆరోపించారు. దేవస్థానం ఉద్యోగుల కథనం ప్రకారం, సులబ్ కాంప్లెక్స్ సమీపంలోని దేవస్థానం స్థలంలో కె. ముత్యం అనే వ్యక్తి అనుమతులు లేకుండా రేకుల షెడ్లు ఏర్పాటు చేసి దుకాణాలను నిర్మించినట్లు గుర్తించారు. ఈ విషయమై సమాచారం అందుకున్న దేవస్థానం అధికారులు, ఇంజనీరింగ్ సిబ్బంది, పర్యవేక్షకులు పోలీసుల సమక్షంలో స్థలాన్ని పరిశీలించారు. నిర్మాణాలపై వివరణ కోరగా సంబంధిత వ్యక్తి ఆగ్రహం వ్యక్తం చేస్తూ సిబ్బందితో వాగ్వాదానికి దిగినట్లు తెలిపారు. అంతేకాకుండా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయిస్తానంటూ హెచ్చరించినట్లు ఆరోపించారు. గతంలో ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగిస్తానని హామీ ఇచ్చినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని ఉద్యోగులు పేర్కొన్నారు. దేవస్థానం ఆస్తులను కాపాడటం తమ బాధ్యత అని, విధి నిర్వహణలో భాగంగా ప్రశ్నించిన సిబ్బందిని బెదిరించడం సమంజసం కాదన్నారు. ఈ ఘటనపై వేములవాడ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు దేవస్థానం ఉద్యోగులు వెల్లడించారు.

# పోచమ్మ బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న ఏనుగు మనోహర్ రెడ్డి



వేములవాడ ( ప్రశ్న న్యూస్) వేములవాడ పట్టణంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జరుగుతున్న పోచమ్మ బోనాల ఉత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య కొనసాగాయి. ఈ సందర్భంగా మహాలక్ష్మీ వీధిలో ఉన్న పెద్దమ్మ--దుర్గమ్మ తల్లి ఆలయాన్ని బీఆర్ఎస్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి శుక్రవారం సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి దర్శనం చేసుకొని ప్రాంత ప్రజల సంక్షేమం కోసం ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ వాసాల లావణ్య--శ్రీనివాస్, పట్టణ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు బైరి సతీష్, మాజీ కౌన్సిలర్లు మారం కుమార్, కందుల క్రాంతి, మాజీ ఎంపీటీసీ ఐలవేని రాజేందర్, అలాగే మల్లికార్జున్, గొట్టం శంకర్, శ్రీనివాస్, మధు, పిల్లి సిద్ధార్థ, కూన బాబు, చెన్నవేని శ్రీనివాస్, గొట్టం దేవయ్య, దేవేందర్, రేగుల శ్రీధర్, మామిండ్ల మహేష్ తదితరులు పాల్గొన్నారు. పండుగ వేడుకల సందర్భంగా ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్న వారు అమ్మవారి కృపతో ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించారు. అలాగే వేములవాడ పట్టణం అన్ని రంగాల్లో మరింత పురోగతి సాధించాలని ఆకాంక్షించారు.

# రాజ్యాంగ పరిరక్షణకు రాహుల్ గాంధీ కృషి అభినందనీయం

**- భారత్ జోడో యాత్రతో ప్రజల మనసు గెలిచిన రాహుల్**

**- కాంగ్రెస్ పార్టీ భీంగల్ మండలాధ్యక్షులు : మల్లెల లక్ష్మణ్**

**- భీంగల్‌లో ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు**



భీంగల్ (ప్రశ్న న్యూస్) కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని భీంగల్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షులు మల్లెల లక్ష్మణ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి కేక్ కట్ చేసి రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మల్లెల లక్ష్మణ్ మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ పరిరక్షణ కోసం రాహుల్ గాంధీ నిరంతరం పోరాడుతున్న నాయకుడని పేర్కొన్నారు. పేదలు, మహిళలు, వెనుకబడిన వర్గాల సమస్యలను దేశవ్యాప్తంగా ప్రస్తావిస్తూ వారి హక్కుల కోసం పార్లమెంట్‌లో గళం విప్పుతున్నారని అన్నారు. ప్రజల కష్టసుఖాలను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు చేపట్టిన భారత్ జోడో యాత్ర దేశ రాజకీయాల్లో ప్రత్యేక ముద్ర వేసిందని, కన్యాకుమారి నుంచి శ్రీనగర్ వరకు వేల కిలోమీటర్ల పాదయాత్ర చేసి ప్రజల సమస్యలను దగ్గరగా అధ్యయనం చేసిన నాయకుడు రాహుల్ గాంధీ అని కొనియాడారు. భవిష్యత్‌లో దేశ నాయకత్వం వహించే సామర్థ్యం ఆయనకు ఉందని, కాంగ్రెస్ శ్రేణులు పార్టీ బలోపేతానికి కృషి చేస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు పరసా అనంతరావు, కౌన్సిలర్లు, వివిధ గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మద్యం సేవించి వాహనం నడిపితే కఠిన చర్యలు తప్పవు

**- రోడ్డు భద్రతే లక్ష్యం..డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు ముమ్మరం**

**- వేములవాడ పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ : వీరప్రసాద్**

**- డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ఉక్కుపాదం.. 143 మందికి జరిమానాలు**



వేములవాడ (ప్రశ్న న్యూస్) మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై పోలీసులు కఠిన చర్యలు కొనసాగిస్తున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఆదేశాల మేరకు వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ ప్రత్యేక తనిఖీల్లో పట్టుబడిన 143 మందిని శుక్రవారం లోక్ అదాలత్ సందర్భంగా వేములవాడ కోర్టులో హాజరుపరిచారు. కేసులను విచారించిన మేజిస్ట్రేట్ మేఘన ఆయా నిందితులకు జరిమానాలు విధించినట్లు పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వీరప్రసాద్ తెలిపారు. వివరాల ప్రకారం 22 మందికి ఒక్కొక్కరికి రూ. 4,000, ఒకరికి రూ. 5,000, 53 మందికి రూ. 3,000 చొప్పున, 59 మందికి రూ. 2,000 చొప్పున, ఐదుగురికి రూ. 2,500 చొప్పున, ముగ్గురికి రూ. 3,500 చొప్పున జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ వీరప్రసాద్ మాట్లాడుతూ, జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో అమలు చేస్తున్న “అరైవ్ అలైవ్” కార్యక్రమం ద్వారా రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రాణనష్టం, ఆస్తి నష్టం జరిగే ప్రమాదం ఉందని, కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదైతే భవిష్యత్తులో ఉద్యోగాలు, ఇతర అవకాశాలపై ప్రభావం చూపే అవకాశం ఉంటుందని, పోలీస్ వెరిఫికేషన్ సమయంలో కూడా ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితులు తలెత్తవచ్చని హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్‌ల పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# కార్మికుల హక్కుల సాధనకు ఐక్య పోరాటం అవసరం

**- ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి : కడారి రాములు**

**- మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ కార్మికుల రాష్ట్ర మహాసభల కరపత్రం ఆవిష్కరణ**



వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ పట్టణంలో శుక్రవారం తెలంగాణ రాష్ట్ర మున్సిపల్, ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 4వ రాష్ట్ర మహాసభల కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు పాల్గొని మాట్లాడారు. మున్సిపల్, ఔట్‌సోర్సింగ్ కార్మికులు అనేక సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం సంఘటిత పోరాటాలు అవసరమని ఆయన అన్నారు. కార్మికుల హక్కుల సాధన, ఉద్యోగ భద్రత, వేతనాల పెంపు, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలపై రాష్ట్ర మహాసభల్లో విస్తృతంగా చర్చించనున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని మహాసభలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, ఇతర కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# యూపీఎస్సీ లో మెరిసిన ఏటూరునాగారం వజ్రం: డిఎస్పి ప్రవీణ్

**సాధారణ కుటుంబం నుంచి అసాధారణ శిఖరం: ఏఐఆర్ 793తో**

**దేశం దృష్టిని ఆకర్షించిన అడవి బిడ్డ**

**సీఎం రేవంత్ ప్రత్యేక చొరవ గవర్నర్‌కు స్వయంగా పరిచయం చేసి తెలంగాణ బిడ్డకు గౌరవం**

**కలం నుంచి ఖాకీ దాకా డి ఎస్ పి ట్రైనింగ్‌లో ఉంటూనే యుపిఎస్ సి కొట్టిన కార్యదీక్షుడు.**

**ఒక్క విజయంతో లక్షల మంది గ్రామీణ యువతకు స్ఫూర్తి పట్టుదలే పెట్టుబడి**

**పేదరికాన్ని జయించి పోరసేవల్లోకి దూసుకెళ్లిన ప్రవీణ్ ప్రస్థానం.**





ఏటూరునాగారం(ప్రశ్న న్యూస్)ఏటూరునాగారం అడవి బిడ్డ, సామాన్య కుటుంబం నుంచి అసామాన్య శిఖరాలకు ఎదిగిన యువకిశోరం దైనంపల్లి ప్రవీణ్. యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ 2025లో ఏఐఆర్ 793 సాధించి, కలలకు కులం లేదని, విజయానికి హద్దులు లేవని నిరూపించాడు. నేడు డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌గా శిక్షణలో ఉన్న ప్రవీణ్ ప్రతిభను గుర్తించిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్ల కు పరిచయం చేసి గౌరవించడం తెలంగాణ ఆత్మగౌరవానికి నిదర్శనం. ప్రవీణ్ విజయం కేవలం ఒక ర్యాంక్ కాదు. అది వేల మంది గ్రామీణ యువత గుండెల్లో రగిలే ఆశ. కష్టం, క్రమశిక్షణ, నిబద్ధత ఉంటే కలం పట్టిన చేయి చట్టాన్ని కాపాడే స్థాయికి ఎదుగుతుందని చెప్పే నిజమైన కథ. ఏటూరునాగారం నేల తల్లి గర్వించేలా, తెలంగాణ పేరు దేశానికి చాటేలా నిలిచిన ఈ వజ్రం నేటి తరానికి దారిదీపం. అడవి బిడ్డ అయినా, పేదరికం ఎదురైనా, పట్టుదల అనే వజ్రాయుధం ఉంటే విధిని కూడా గెలవచ్చని ప్రవీణ్ నిరూపించాడు. అతని గెలుపు ఒక వ్యక్తి గెలుపు కాదు, ఒక ప్రాంతపు ఆత్మవిశ్వాసానికి నిలువెత్తు నిదర్శనం.

# నాచారం పారిశ్రామిక వాడలో అక్రమ పాఠశాల




- అధికారుల మౌనం, విద్యార్థుల ఆరోగ్యంతో చెలగాటం
- "రెసొనెన్స్ స్కూల్స్" అనుమతుల్లేకుండా నిర్వహణ
- డిఈఓ, ఎంఈఓ లు మీ కళ్ళకు గంతలు కట్టారా.?
- విషపు గాలులు పీలుస్తూ చదువులు
- పిల్లల ప్రాణాలతో వ్యాపారం

**'నేరస్థులు నిర్వహిస్తారు --- అధికారులు నిద్రపోతారు**
**- పిల్లలు రోగిష్టులవుతారు --- ఇదా మన విద్యా వ్యవస్థ?'**




నాచారం(ప్రశ్న న్యూస్) పారిశ్రామిక కాలుష్యం విలయతాండవం చేస్తున్న నాచారం ఇండస్ట్రియల్ ఏరియాలో అనుమతులు లేకుండానే "రెసొనెన్స్ స్కూల్స్" పేరుతో పాఠశాల నిర్వహిస్తున్న ఘటన తీవ్ర సంచలనం రేపుతోంది. ఫ్యాక్టరీల నుంచి వెలువడే విషవాయువులు, రసాయన కాలుష్యం మధ్య లేత మొగ్గల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న "రెసోనెన్స్ స్కూల్ యాజమాన్యం దుర్మార్గానికి అధికార యంత్రాంగం ఊకదంపుడు వేస్తోందన్న ఆరోపణలు స్థానికులలో తీవ్ర ఆగ్రహం రేపుతున్నాయి.


### అధికారులు నిద్రలో.. లంచాల మత్తులో.?

విద్యా హక్కు చట్టం ప్రకారం పాఠశాలల నిర్వహణకు తప్పనిసరిగా సంబంధిత అధికారుల అనుమతులు పొందాల్సి ఉంటుంది. అగ్ని మాపక సదుపాయాలు, భవన భద్రత, ఆరోగ్య ప్రమాణాలు, తగిన స్థలం ఇవన్నీ ప్రాథమిక అవసరాలు. కానీ పారిశ్రామిక వాడ నడిబొడ్డున, విషపు పొగలు క్రక్కే ఫ్యాక్టరీల పక్కన స్కూల్ నిర్వహణకు ఎలా అనుమతులు ఇస్తారు.? ఎవరు ఇచ్చారు.? ఇవ్వలేదా.? ఇవ్వకపోతే డీఈవో ఎంఈఓ లు సీజ్ చేయకుండా ఏం చేస్తున్నారు.?

వాళ్ల మౌనం వెనక అంతర్యం ఏమిటి.?లంచాల లావాదేవీలు జరిగాయా.? నోట్ల కట్టలు మారితే నిబంధనలు మారతాయా.? అధికార బాధ్యతలు అమ్మకానికి పెట్టారా.? స్థానిక ప్రజల నుండి, మీడియా నుండి వెల్లువెత్తుతున్న ఈ ప్రశ్నలకు జిల్లా విద్యాధికారి, మండల విద్యాధికారి సమాధానం చెప్పాల్సిందే అన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### పిల్లల ఆరోగ్యం పై తల్లిదండ్రులకు బాధ్యత లేదా.?

పారిశ్రామికవాడలో ఏర్పాటు చేస్తున్న పాఠశాలలో అసలు విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల్ని ఎలా జాయిన్ చేస్తున్నారు. అంటే వాళ్ల కన్నపిల్లల ఆరోగ్యం పై తల్లిదండ్రులకు బాధ్యత లేదా.? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పిల్లల ఊపిరితిత్తులు, పారిశ్రామిక వ్యర్థాల డంపింగ్ యార్డా.?పారిశ్రామిక ప్రాంతాల్లో


L.No: 171 / UPL / 2026

**Sub:** Sec. Edn –Submission of reply under - RTI Act, 2005 in r/o Resonance School, Nacharam- Uppal Mandal – Medchal Malkajgiri District Reg

**Ref:** DEO Proc Rc No: 10/A3/RTI/2026 Dt : 22.01.2026

With reference to the above cited subject in the reference 1st cited the RTI Applications dated 22.01.2026 received in this office and the information sought by applicant is furnished hereunder point-wise:

1. **Answer for Point No 1 & 2:** Permission has not been given to resonance School, Nacharam
2. **Answer for Point No : 03 :** Kindly refer the GOMs No : 1 & 74
3. **Answer for Point No : 04** For the 5 Private Schools as mention in Point No 04 ,Government of Telangana, Education Department has not provided any free education for the Poor and Underprivileged Students.
4. **Answer for Point No : 05** Under RTE Act, no Students are provided Free Education for the Academic Year 2026-27

Thanking You

Yours faithfully

Mandal Educational Officer
Uppal Mandal
Medchal Malkajgiri District

MANDAL EDUCATIONAL OFFICER

Copy Submitted to
01)The DEO , Medchal Malakajgiri District

వెలువడే సల్ఫర్ డై ఆక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్లు, భారలోహాలు, రసాయన ధూళి ఇవన్నీ పిల్లల సున్నితమైన ఊపిరితిత్తులపై, మెదడు అభివృద్ధిపై తీవ్ర ప్రభావం చూపుతాయని విద్యార్థుల తల్లిదండ్రులకు భయం లేకపోవడం విస్మయాన్ని కలిగిస్తుంది.
ఆస్తమా, బ్రాంకైటిస్, శ్వాసకోశ వ్యాధులు మెదడు పనితీరు మందగమనం, జ్ఞాపకశక్తి క్షీణత రక్తంలో లెడ్ స్థాయిలు పెరిగి నాడీ వ్యవస్థ దెబ్బతినడం

### చర్మ వ్యాధులు, కంటి సమస్యలు

ఈ విషయాలు తెలియని అధికారులు అమాయకులా.? తెలిసి కూడా కఠిన చర్యలు తీసుకోకుండా చూస్తూ ఊరుకుంటే వారు నేరస్థులు కాదా.?

### విద్యార్థి సంఘాలు ఎక్కడ.? నిద్రపోతున్నాయా? చచ్చిపోయాయా.?

ప్రతి అన్యాయానికి గొంతెత్తాల్సిన విద్యార్థి సంఘాలు, యువజన సంఘాలు ఎక్కడున్నాయి.? రేపటి తరం ఆరోగ్యం ప్రమాదంలో ఉంటే కూడా మౌనంగా ఉంటారా.? ఓట్ల రాజకీయాల్లో మునిగిపోయారా.? నాయకత్వ పదవుల కోసం పరుగులు పెడుతున్నారా.? విద్యార్థుల భవిష్యత్తు మన లక్ష్యం నేటి బాలులే రేపటి పౌరులు అన్న వాక్యాలు మరిచిపోయారా.?
భవిష్యత్తులో పిల్లల రోగాల బాధ్యత ఎవరు తీసుకుంటారు.?




### రిపోర్టర్లపై బెదిరింపులు, అరాచకమా.? అహంకారమా.?

అసలు విస్మయానికి గురి చేస్తున్న విషయం ఏమిటంటే, ఈ అక్రమాలను వెలుగులోకి తెచ్చిన మీడియా ప్రతినిధులను యాజమాన్యం బహిరంగంగా బెదిరించడం, ప్రశ్నలు అడిగినందుకు భయపెట్టడం వార్తలు రాయకూడదంటూ బెదిరించడం చూస్తుంటే సమాజంలో ప్రశ్నించే ఏకైక గొంతు మీడియానే దానిని కూడా నొక్కి వేస్తే ఇక అవినీతి అక్రమాలే రాజ్యమేలుతాయన్న మేధావుల మాటలు నిజమవుతున్నాయి.
ఇదేమి ప్రజాస్వామ్యం.? చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేసేవారే ప్రశ్నించేవారిని బెదిరిస్తారా.?పత్రికా స్వేచ్ఛను కాలరాయడంసత్యాన్ని అణచివేయడానికి బెదిరింపు వ్యూహాలుఅక్రమాలను మరుగుపరచడానికి దాష్టీకం ఈ యాజమాన్యంపై పోలీసులు కేసు నమోదు చేయరా.? బెదిరింపు, అభద్రతా భావం కల్పించడం శిక్షార్హం కాదా.?

### చట్టంలో ఉన్నది ఏమిటి.? అధికారులు చేస్తుందేమిటి.?

అనుమతి లేకుండా పాఠశాల నిర్వహణ, శిక్షార్హమైన నేరం ఆర్.టి.ఈ చట్టం ఉల్లంఘన, క్రిమినల్ చర్యలకు అరహం పిల్లల ఆరోగ్య హాని, మానవ హక్కుల ఉల్లంఘన మీడియా బెదిరింపు పై కఠిన చర్యలు తీసుకోవాలి. స్కూల్ అనుమతులు ఎందుకు తనిఖీ చేయలేదు.? పారిశ్రామిక వాడలో స్కూల్‌కు ఎన్ఓసి ఎవరిచ్చారు.? (కాలుష్య నియంత్రణ మండలి) ఈ ప్రాంతంలో స్కూల్‌కు క్లియరెన్స్ ఇచ్చిందా.? యాజమాన్యంపై బెదిరింపు కేసు ఎందుకు నమోదు కాలేదు.? లాభాల కోసం లేలేత పిల్లల ఆరోగ్యంతో ఆడుకోవడం క్షమార్హం కాదు. అధికారుల నిర్లక్ష్యం, యాజమాన్య దుర్మార్గం, ఈ రెండూ కలిసి పసికందుల భవిష్యత్తును హరిస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి ఎంఈఓ, డిఈఓ లపై విచారణ జరిపించాలి. అక్రమ పాఠశాలను మూసివేయాలని యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. మీడియా బెదిరింపులపై కేసులు నమోదు చేయాలి. లేకపోతే ఈ పాఠశాలలో చదివే పిల్లల ఆరోగ్యం ధ్వంసమై, రేపు వారి రోగాల బాధ్యత ఈ అధికారులు, ఈ ప్రభుత్వం తీసుకోవాల్సి వస్తుందని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

---

తెలంగాణలో మూడు రోజులు

# రిజిస్ట్రేషన్లు బంద్

**- సర్వర్ మెయింటెనెన్స్ కారణంగా జూన్ 26 నుంచి 28 వరకు బంద్**

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణవ్యాప్తంగా ఆస్తుల రిజిస్ట్రేషన్లు, ఇతర అనుబంధ ఆన్‌లైన్ సేవలు మూడు రోజుల పాటు నిలిచిపోనున్నాయి. సర్వర్ల నిర్వహణ, అప్‌గ్రేడేషన్ పనుల కారణంగా జూన్ 26 నుంచి 28వ తేదీ వరకు ఈ సేవలు అందుబాటులో ఉండవని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ స్పష్టం చేసింది. దాదాపు ఐదేళ్ల తర్వాత చేపడుతున్న ఈ కీలకమైన నిర్వహణ పనుల ద్వారా సర్వర్ల పనితీరును, భద్రతను మరింత మెరుగుపరచనున్నట్లు స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఇన్‌స్పెక్టర్ జనరల్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. భవిష్యత్తులో ప్రజలకు మరింత వేగవంతమైన, సులభతరమైన సేవలు అందించడమే ఈ అప్‌గ్రేడేషన్ ప్రధాన లక్ష్యమని ఆయన వివరించారు.ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఉండేందుకు ఈ షట్‌డౌన్‌ను సెలవు దినాల్లో నిర్ణయించారు. జూన్ 26న మొహర్రం పబ్లిక్ హాలిడే, జూన్ 28 ఆదివారం కావడంతో కేవలం ఒకే ఒక పనిదినమైన జూన్ 27 (శనివారం) మాత్రమే సేవలపై ప్రభావం పడనుంది. ఇప్పటికే జూన్ 27వ తేదీ కోసం స్లాట్లు బుక్ చేసుకున్న వారికి, వాటిని జూన్ 25వ తేదీకి మార్చినట్లు అధికారులు వెల్లడించారు. ఈ మూడు రోజుల పాటు రిజిస్ట్రేషన్ శాఖ వెబ్‌సైట్, ఆన్‌లైన్ పోర్టల్స్‌లు పనిచేయవు. జూన్ 29వ తేదీ నుంచి సేవలు యథావిధిగా పునఃప్రారంభమవుతాయని, పౌరులు దీనికి అనుగుణంగా తమ పనులను ప్రణాళిక చేసుకోవాలని అధికారులు సూచించారు.

# తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రక్షాళన

**- జూన్ 25 నుంచి ఇంటింటి సర్వే**




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రక్షాళనకు ఎన్నికల సంఘం సన్నద్ధమైంది. సుమారు 25 ఏళ్ల తర్వాత రాష్ట్రంలో తొలిసారిగా నిర్వహిస్తున్న 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) - 2026' కార్యక్రమాన్ని జూన్ 25 నుంచి చేపట్టనున్నారు. ఈ కార్యక్రమ సన్నద్ధతపై రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి (సీఈఓ) సి. సుదర్శన్ రెడ్డి అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. జీహెచ్‌ఎంసీ కమిషనర్, జిల్లా ఎన్నికల అధికారులు (డీఈఓలు), ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు (ఈఆర్‌ఓలు), అదనపు సీఈఓ డాక్టర్ వాసం వెంకటేశ్వర్ రెడ్డితో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ కార్యక్రమాన్ని అత్యంత పారదర్శకంగా, కచ్చితత్వంతో నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌ఓలు), ఏజెంట్లతో సమన్వయం చేసుకుంటూ, ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు.ఈ ప్రక్రియలో భాగంగా జూన్ 25 నుంచి జూలై 24 వరకు బీఎల్‌ఓలు ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాలను సేకరించి, వాటిని ధృవీకరిస్తారు. నకిలీ, మరణించిన మరియు చిరునామా మారిన ఓటర్లను జాబితా నుంచి తొలగించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశం. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా 35,000 మందికి పైగా బీఎల్‌ఓలు, దాదాపు 26,000 మంది బూత్ లెవల్ ఏజెంట్లు క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించనున్నారు. 2026 అక్టోబర్ 1వ తేదీని అర్హత తేదీగా ప్రామాణికంగా తీసుకుని తుది ఓటరు జాబితాను ప్రచురిస్తారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సుమారు 3.39 కోట్ల మంది ఓటర్ల వివరాలను ఈ సర్వేలో సమగ్రంగా పరిశీలించనున్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకొని తమ ఓటు వివరాలను సరిచూసుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

---

# బడి బస్సుల భద్రత ఎంత.?

- ప్రైవేటు విద్యాసంస్థల కాసుల కక్కుర్తి
- అధికారుల ఉదాసీనత ఖరీదు పసివాళ్ల ప్రాణాలు
- కాగితాల్లో ఉన్న నిబంధనలు క్షేత్రస్థాయిలో అమలవుతున్నాయా.?
- అధికారులు స్కూల్ బస్సులపై నిఘా పెంచాల్సిందే
- ప్రైవేట్ బడిబస్సుల ప్రయాణాలు పదిలమేనా

**"తమ బిడ్డలకు ఉజ్వల భవిష్యత్ ఇవ్వాలనే ఉద్దేశ్యంతో లక్షలాది రూపాయలు వెచ్చించి తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ స్కూల్సుకు పంపిస్తున్నారు. మరి ఆ బస్సులు భద్రమేనా ? అనే సందేహాలు తల్లిదండ్రుల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. స్కూల్ యాజమాన్యాలు తమ పాఠశాలల్లో చక్కగా చదువు నేర్పిస్తామని ఆశ కల్పించటంతో తల్లిదండ్రులు వారి పిల్లల భవిష్యత్ గురించి ఆలోచించి ప్రైవేట్ స్కూల్ బస్సుల్లో విద్యార్థులను పంపిస్తున్నారు. ఇంటి నుంచి వెళ్లి తిరిగి వచ్చే వరకు తల్లిదండ్రులు ఆందోళనగానే ఉంటున్నారు. నిరంతరం ప్రైవేట్ స్కూల్ బస్సులపై పర్యవేక్షణ చేయాల్సిన రవాణా శాఖ అధికారులు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రమాదాలు ఏమైనా జరిగినప్పుడు హడావిడి చేసేసి అనంతరం ప్రైవేట్ బస్సుల ఫిట్నెస్ గురించి పట్టించుకోవటం లేదనే విమర్శలు ఉన్నాయి."**

**హైదరాబాద్ ( ప్రశ్న న్యూస్ )** ప్రైవేట్ స్కూల్ బస్సుల ఫిట్ నెస్ విషయంలో రవాణా శాఖ అధికారులు ఫిట్ నెస్ పట్టించుకోవటం లేదనే విమర్శలు దారాళంగా వినబడుతున్నాయి. ప్రైవేట్ స్కూల్ యాజమాన్యంతో రవాణ శాఖ మిలాఖత్ అవ్వటం, మామూళ్లు చెల్లించి రోడ్లపై ఫిట నెస్ సరిగా లేని డొక్కు బస్సులు వినియోగిస్తున్నట్లు తెలియవస్తుంది. ఆ డొక్కు బస్సుల్లోనే విద్యార్థులను స్కూళ్లు, కళాశాలలకు తీసుకెళ్తున్నట్లు తల్లిదండ్రులు ఆరోపణలు గుప్పిస్తున్నారు. మేడ్చల్ మండలంలోని పెద్ద విద్యాసంస్థల్లో కొత్త బస్సులతోపాటు పాత బస్సులు కూడా ఉన్నాయి. వాటికి తాత్కాలిక మరమ్మత్తులు చేసి రోడ్ల మీదకు పంపుతుండటంతో ప్రమాదం జరిగిన తర్వాత స్పందిస్తారే తప్పా ముందుగా అధికారులు ఎందుకు స్పందించటం లేదనే విమర్శలు తల్లిదండ్రులు గుప్పిస్తున్నారు.

### ప్రతీ ఏడాది బ్రేకు వెళ్తున్నాయా.?

ప్రతీ ఏడాది విద్యా సంవత్సరం ఆరంభంలో ఫిట్ నెస్ ఉందో లేదో తనిఖీలు నిర్వహించాల్సిన బాధ్యత రవాణ శాఖ అధికారులపై ఉంది. స్కూల్ యాజమాన్యం ఆ బస్సులను బ్రేక్ కు తీసుకెళ్లాల్సి ఉండగా, ఆ సమయంలో రవాణాశాఖ అధికారులు వాటి ఫిట్ నెస్ చూసి ఫర్ఫెక్ట్ ఉన్నాయో ? లేదో చూడాల్సిన బాధ్యత ఉంది. కానీ అది కూడా తూతూ మంత్రంగానే చేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

### నిబంధనలకు విరుద్ధంగా .?

గత విద్యా సంవత్సరంలో ప్రైవేటు బస్సులు ఆగిపోవడం, కిక్కిరిసిన బస్సుల్లో విద్యార్థులను ఎక్కించుకోవడం జరిగింది. మండలంలో ప్రైవేట్ పాఠశాలల బస్సులు ఫిట్ నెస్ సరిగ్గా లేకపోయినప్పటికీ అధికారులను మేనేజ్ చేసి బస్సులను రహదారులపై తిప్పుతున్నారని విద్యార్థులు తల్లిదండ్రులు వాపోతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపే విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. ఇప్పటికైనా మేడ్చల్ మండలంలో ప్రైవేట్ విద్యాసంస్థల బస్సులపై రవాణా శాఖ అధికారులు నిత్యం తనిఖీలు చేసి, ఫిట్ నెస్ సరిగా లేని బస్సులను నడపకుండా చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

### తక్కువ జీతాల కోసం అనామకులు..

భారీ వాహనాలు నడిపిన అనుభవం లేని వారిని, హెవీ లైసెన్స్ లేని క్లీనర్లను తక్కువ జీతాలకు దొరుకుతున్నారని డ్రైవర్లుగా పెట్టుకుంటున్నారు. డ్రైవర్లకు కనీస వైద్య పరీక్షలు, కంటి పరీక్షలు నిర్వహించడం లేదు. ఆ రోజు అవసరం నిమిత్తం బస్సు నడపగలితే చాలు అన్నట్లుగా డ్రైవర్లను నియమిస్తున్నారు కొన్ని విద్యాసంస్థలు. బస్సుల కండిషనన్ను మాత్రం ఏమాత్రం ఖాతరు చేయడం లేదు.

### సామర్థ్య ధ్రువీకరణ తప్పనిసరి..

పదుల సంఖ్యలకు పైగా ప్రైవేట్ స్కూల్ బస్సులు కనీస సామర్థ్య ధ్రువీకరణ పత్రం లేకుండానే




రోడ్లపై స్వేచ్ఛగా తిరుగుతున్నాయి. స్కూళ్లు తెరిచే ముందు హడావుడి చేసే ఆర్టీఏ అధికారులు, ఆ తర్వాత ప్రైవేట్ యాజమాన్యాల ఒత్తిళ్లకు తలొగ్గి తనిఖీలను గాలికొదిలేస్తున్నారు. అత్యధిక బస్సుల్లో ఎమర్జెన్సీ ఎగ్జిట్ తలుపులు తుప్పుపట్టి తెరుచుకోని స్థితిలో ఉన్నాయి. మరికొన్ని బస్సుల్లో ఆ ద్వారాలకు అడ్డంగా సీట్లు వేసి అదనపు విద్యార్థులను కూర్చోబెడుతున్నారు. ఫస్ట్ ఎయిడ్ బాక్సులు ఉన్నా, వాటిలో అత్యవసర మందులు ఉండవు. ఒకవేళ ఉన్నా అవి ఎప్పుడో కాలంచెల్లిన మందులే ఉంటున్నాయి.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588